


స్మార్ట్ పీడగ!

- మొబైల్ ఫోన్లకు బానిసలవుతున్న జనం
- పిల్లల నుంచి పెద్దల వరకూ అదే 'మాయ'లో..
- 90శాతం మంది పిల్లలపై అధిక ప్రభావం
- నాడీ సంబంధ సమస్యలు తలెత్తే ప్రమాదం
- నయనాలకు నష్టమని తెలిసినా వదలని వైనం
- మితిమీరిన వాడకంతో దెబ్బతింటున్న బాంధవ్యాలు



5

"పిల్లలకు గోరుముద్దలు తినిపించాలంటే ఒకప్పుడు చందమామను చూపించి.. చందమామ రావే, జాబిల్లిరావే అంటూ అమ్మ తన అద్భుతమైన గొంతుతో పాడుతూ కడుపు నిండా తిండిని తినిపించేది. కానీ ఇప్పుడు సెల్‌ఫోన్లు చూడందే.. రైమ్స్ వినిపించనిదే.. కదలాడే బొమ్మలు కానరానిదే చిన్నారులకు ముద్ద కూడా మింగడం లేదు. దీంతో చేసేది లేక తల్లిదండ్రులు పిల్లల చేతుల్లో ఫోన్లు పెడుతున్నారే తప్ప కాలక్రమేనా వచ్చే నష్టాలను అంచనా వేయలేక పోతున్నారు."

ఇప్పుడంతా స్మార్ట్ యుగం నడుస్తోంది. చిన్నపిల్లల నుంచి ముసలి వారి వరకు సెల్‌ఫోన్ లేకుంటే పూట గడవడం లేదు. అరచేతిలోకి వచ్చిన ప్రపంచాన్ని చూస్తూ గంటలకొద్దీ మాయా లోకంలో విహరిస్తున్న పరిస్థితి. మానవ సంబంధాలు, బంధుత్వాలు తగ్గుతున్నా.. కళ్లకు ప్రమాదమని తెలిసినా.. నాడీ సంబంధ సమస్యలు తలెత్తుతాయని హెచ్చరిస్తున్నా.. జీవితమే చీకటి మయమవుతుందని చెబుతున్నా మొబైల్ ఫోన్లను మాత్రం వదలడం లేదు. ఇటీవల సైబర్ మీడియా రీసెర్చ్ (సీఎంఆర్) ఓ స్మార్ట్ ఫోన్ల తయారీ సంస్థతో కలిసి దేశంలోని పలు ముఖ్య నగరాల్లో జరిపిన సర్వేలోనూ ఈ విషయాలే స్పష్టమయ్యాయి. 90 శాతం మంది సెల్‌ఫోనే ప్రపంచంగా బతుకుతున్నారని తేలింది. ముమ్ముందు రోజుల్లో ఈ అనారోగ్య సమస్యలే కాకుండా.. నా అనేవారు లేక ఒంటరయ్యే పరిస్థితి ఏర్పడుతుందన్న ఆందోళన వ్యక్తమైంది. అయితే ఇలాంటి దుష్పరిణామాలను గుర్తించిన ఆస్ట్రేలియా ప్రభుత్వం 16 ఏళ్లలోపు పిల్లలకు ఇన్‌స్టాగ్రామ్ మినహా సోషల్ మీడియా నిషేధిస్తూ ఇటీవల అసెంబ్లీలో తీర్మానం చేయడం విశేషం.

- నర్సింహులపేట / గార్ల, ఆంధ్రజ్యోతి



ఓరుగల్లు పత్తికి మహర్దశ

- వరంగల్‌కు పత్తి పరిశోధన కేంద్రం మంజూరు
- ఆమోదం తెలిపిన భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి
- మరిన్ని పరిశోధనలకు ఆస్కారం
- జాతీయ స్థాయిలో పత్తిసాగుపై టెక్నాలజీని పెంచుకునే అవకాశం
- బీటీ-2 పత్తి సాగు, ఉత్పత్తులు పెరిగే చాన్స్
- కొత్త వంగడాల సాగు, చీడ పీడల విరుగుడుకు పరిశోధనలు
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో యేటా 5,13,289 ఎకరాల్లో పత్తిసాగు

దేశంలోనే నాణ్యమైన పత్తిని అందించే ఓరుగల్లుకు రైతులకు శుభవార్త. వరంగల్‌లో పత్తి పరిశోధన కేంద్రం మంజూరైంది. ఈ మేరకు ఏర్పాటుకు అనుకూలంగా ఏఐసీఆర్‌పీ, ఐసీఏఆర్ సంస్థలు ఆమోదం తెలిపాయి. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఈ కేంద్ర కార్యకలాపాలు సాగుతాయి. ఈపరిశోధన కేంద్రం నుంచి ప్రధాన శాస్త్రవేత్తలు, శాస్త్రవేత్తలు వివిధ రకాల పంటలపై పరిశోధనలు చేస్తున్నారు.

2020లోనే వరంగల్‌లో పత్తి పరిశోధన కేంద్రం కోసం ప్రతిపాదనలు పంపగా, ఎట్టకేలకు మంజూరైంది. వంగడాలు, దిగుబడి, చీడపీడలు, నివారణ చర్యలపై పరిశోధనలు జరగున్నాయి. కాగా, వరంగల్‌కు పత్తి పరిశోధనా కేంద్రం మంజూరుపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

5

నిజాయితీతో పనిచేస్తా..

- నా జీవితం ప్రజాసేవకే అంకితం
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లిటౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నిజాయితీగా పనిచేస్తూ తన జీవితాన్ని ప్రజాసేవకే అంకితం చేస్తానని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయ ణరావు అన్నారు. ఎమ్మెల్యేగా పదవి బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా భూపాలపల్లిలోని కాం గ్రెస్ జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భూపా లపల్లి నియోజకవర్గంలోని ప్రజల ఆశీస్సులతో తాను ఎమ్మెల్యేగా గెలిచి ఏడాది గడిచిందని అన్నారు. ఎన్నికై న నాటి నుంచిప్రజలకు అందుబాటులో ఉంటూ అన్ని సమస్యలపై స్పందిస్తూ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తు న్నానని అన్నారు. దీనికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, అధికార యంత్రాంగం సహకారం ఉందని అన్నారు. ఈ క్రమంలోనే గాంధీనగర్‌లో 157 ఎకరాల లో ప్రభుత్వభూమి కబ్జాకు గురవుతుంటే దానిని కాపా డి అందులో అన్ని వర్గాల వారికి విద్య అందించేలా ఎడ్యుకేషన్‌గా హబ్‌ను ప్రారంభించామని అన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు ఇండస్ట్రీయల్ పార్కును కూడా ఏర్పాటు చేస్తున్నా మని తెలిపారు. వీటికి సుమారు రూ.146కోట్లు వెచ్చించినట్లు చెప్పారు. కేంద్రీయ విద్యాలయానికి పదెకరాల భూమిని కేటాయించి నిధుల కోసం డిల్లీలో కేంద్ర మంత్రిని కలిసినట్లు తెలిపారు. ఎస్సీ ఎస్టీ, బీసీ హాస్టళ్లకు ప్రత్యేక భవనాలు, పీజీ కళాశాల భవనం కోసం నిధులు మంజూరు చేయించానన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం కోసం జెన్‌కో సీఎస్‌ఆర్ నిధులు రూ.3కో ట్లు తెప్పించినట్లు తెలిపారు. ప్రధాన రహదారిపై నిత్యం ప్రమాదాలు జరిగి అనేక మంది మృతి చెందుతు న్న నేపథ్యంలో నేషనల్ హైవే అధికారులతో మాట్లాడి రోడ్డు వెంట ట్రామా సెంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నర్సింగ్ కళాశాల కోసం రూ.26కోట్లు వెచ్చిం చామని, 100 పడకల ఆస్పత్రిలో 203 పోస్టులు భర్తీ చేయించామని అన్నారు. రూ.13కోట్లతో భవనం మరో అంతస్తు పెంచి లిఫ్ట్ కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 37మంది వైద్య పోస్టుల ఖాళీలను త్వరలో భర్తీ చేస్తామని అన్నారు. బుద్దారం నుంచి కొడవటం చకు డబుల్ రోడ్డు నిర్మాణం కోసం రూ.60కోట్లు ప్రతి పాదనలు పంపామని, నిధులు కూడా మంజూరు అయ్యాయని అన్నారు. అలాగే జిల్లాను టూరిజంలో అగ్రగామిగా నిలిపేందుకు కోట్లాది రూపాయల నిధులు తీసుకురానున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే పాండవులగుట్టకు, బుగులోని జాతర కోసం మెట్ల నిర్మాణానికి, వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం రూ.1.30కోట్లు మంజూరు చేయించినట్లు వివరించారు. భీంఘనపురం చెరువుకు రూ.30కోట్లు, గణపురం చెరువుకు రూ.5కోట్లు వెచ్చించి సుందరంగా తీర్చిదిద్దనున్నామని అన్నారు. టేకుమట్ల, గోరికొత్తపల్లి మండలాల్లో కార్యాలయాల భవనాల కోసం రూ.6.20కోట్లు ఖర్చు చేసినట్టు తెలిపారు. పాఠశాలలను అభివృద్ధి చేయడా నికి రూ.7కోట్లు వెచ్చించామని అన్నారు.. అన్ని గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం కోసం రూ.30కోట్లు, భూపా లపల్లి పట్టణాభివృద్ధికి, అమృత్ స్కీం కింద రూ.15కో ట్లు ఖర్చు చేసినట్టు తెలిపారు. ఈ నెల 11, 12 తేదీల్లో ఏదో ఒకరోజు మంత్రులను ఆహ్వానించి ప్రారంభిస్తా మని అన్నారు. అన్ని మండల కేంద్రాల్లో రూ.28 కోట్లతో సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కోటగుళ్లకు రూ.73కోట్లు, నాపాక దేవాలయానికి నిధు లు మంజూరు చేయించినట్టు చెప్పారు. సీఎస్‌ఆర్ నిధులు రూ.65కోట్లు, ఆర్అండ్‌బీ రూ.65కోట్లు, డీఎంఎఫ్‌టీ రూ.25కోట్ల నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని లిఫ్టలను సరిచేసేందుకు నిధుల కోసం ప్రతిపాదనలు పంపామన్నారు. గొర్లవీడు ఇందిరాసాగర్ ప్రాజెక్టు నిర్మాణం కోసం కూడా ప్రాతి పదనలు పంపామని తెలిపారు. భూపాలపల్లికి తప్పని సరిగా రింగ్ రోడ్డు నిర్మాణం చేపడతామని అన్నారు. అటవీ శాఖ భూమి ఉన్న నేపథ్యంలో ఆరు కిలోమీటర్ల మేరకు రూ.300 కోట్లు ఖర్చవుతాయని అంచనా వేసిన ట్లు తెలిపారు. వీటితో పాటు రాష్ట్రంలో ఇచ్చిన హామీల్లో ఐదు గ్యారెంటీలను నెరవేర్చామని అన్నారు. త్వరలో మహిళలకు రూ.2500 కూడా ఇచ్చేందుకు కృషి చేస్తు న్నామని తెలిపారు. నియోజకవర్గానికి 4వేల ఇందిర మ్మ ఇళ్లు మంజూరు చేయిస్తానన్నారు. విలేకరుల సమావేశంలో ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్, డీసీసీ అధ్యక్షు డు అయిత ప్రకాశ్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు దాట్ల శ్రీనివాస్, ముంజాల రవీందర్, శిరుప అనిల్, పిప్పాల రాజేందర్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలి

ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి



మాట్లాడుతున్న పిడమర్తి రవి

భూపాలపల్లిటౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మాదిగలకు 12శాతం రిజర్వేషన్ కల్పించాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి డిమాం డ్ చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బాతాల రాజు భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంద కృష్ణమాదిగకు తాము వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. వర్గీకరణ ఉద్యమం ప్రారంభమైనప్పటి నుంచి ఎస్సీల జనాభా విపరీతంగా పెరిగిందని, దీంతో వర్గీకరణ తప్పనిసరి అయ్యిందన్నారు. దీనిపై అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని, దానికి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి కమిటీని వేశారని గుర్తు చేశారు. దానిని ఎందుకు అమలు చేయడం లేదో చెప్పాలన్నారు. సమావేశంలో ఉపేందర్, వీరేందర్, కిషోర్, శ్రీకాంత్, రవీందర్ పాల్గొన్నారు.



మహాసభలో మాట్లాడుతున్న నాగయ్య

బలమైన ప్రజా ఉద్యమాలు నిర్మించాలి

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య

ఏటూరునాగారం రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బలమైన ప్రజా ఉద్యమాలను నిర్మించేందుకు పోరాటాలను విస్తృతపరచాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సీపీఎం ములుగు జిల్లా రెండో మహాసభలు శనివారం జరిగాయి. ముఖ్య అతిథిగా నాగయ్య హాజరయ్యారు. జిల్లాలో గోదావరి జలాలను కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అందించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని, అమాయక గిరిజనులపై ఫారెస్టు అధికారులు పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. గిరిజన గ్రామాల్లో తాగునీరు, విద్యుత్, రోడ్డు సౌకర్యం కల్పించేందుకు కృషి చేయాలని, జిల్లాలో వివాదస్పదంగా ఉన్న 40ఎకరాల ఫారెస్ట్ భూములకు జాయింట్ సర్వే చేపట్టాలని కోరారు. బిల్ట్ ఫ్యాక్టరీ స్థానంలో కొత్త ఫ్యాక్టరీ నిర్మించి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం కింద రూ.26వేలు ఇవ్వాలని, రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు సూడి కృష్ణారెడ్డి, బండారు రవికుమార్, మచ్చ వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌కు ఏర్పాట్లు

జనగామ డీఈవో ఎం. రమేష్

జనగామ కల్చరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ ఈనెల 9, 10 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు జనగామ డీఈవో ఎం. రమేష్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని యాజమాన్యాల ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు విద్యార్థులను సిద్ధం చేయాలన్నారు. జిల్లా కేంద్రంలోని సెయింట్‌పాల్స్ ఉన్నత పాఠశాలలో నిర్వహించే ఈ కార్యక్రమానికి విద్యార్థులు 8న రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. సుస్థిర భవిష్యత్తు కోసం శాస్త్రసాంకేతిక అనే ప్రధానాంశంపై విద్యార్థులు ఆవిష్కరణలు చేయా లన్నారు. ఉపాధ్యాయులతో పాటు బీఈడీ, డీఈడీ ట్రైనీ విద్యార్థులు కూడా నూతన ఆవిష్కరణలతో బోధనాభ్యసన సామగ్రిని ప్రదర్శించవచ్చన్నారు. ప్రదర్శనలో విద్యార్థులకు రెండో రోజు సాయంత్రం సెమినార్ నిర్వహించబడు తుందన్నారు. అలాగే జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ 2023-24 ప్రదర్శన కూడా కార్యక్ర మంలో నిర్వహించబడుతుందన్నారు. వారికి వారి ఖాతాలలో ప్రదర్శన కోసం డబ్బులు జమ చేసినట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు జిల్లా సైన్స్ అధికారి ఉపేందర్‌ను 944 14 53662 నంబరులో సంప్రదించాలన్నారు.

సన్నాహక సమావేశం

జిలాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహణ పై జిల్లా సైన్స్ అధికారి ఉపేందర్ అధ్యక్షతన శనివారం సెయింట్ పాల్స్ ఉన్నత పాఠశాలలో సన్నాహక సమావేశం జరిగింది. డీఈవో రమేష్ ముఖ్యఅతిథిగా హాజరై కమిటీ సభ్యులకు పలు సూచనలు చేశారు. నిర్వహణకు గాను రిజిస్ట్రేషన్ కమిటీ, భోజన కమిటీ, సాంస్కృతిక కమిటీ, జడ్జిమెంట్ కమిటీ, ఆహ్వాన కమిటీ, లాజిస్టిక్ కమిటీ సభ్యులకు డీఈవో దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు రఘునందన్‌రెడ్డి, రాజేందర్, వెంకట్‌రెడ్డి, జానకిదేవి, సూపరింటెండెంట్ మహమూద్, ఏసీజీఈ రవికుమార్, డీసీఈబీ సెక్రటరీ చంద్రభాను, హెచ్‌ఎంలు మల్లికార్జున్, రాజేందర్, శోభన్‌బాబు, డీసీఈబీ సహాయ కార్యదర్శి మెరుగు రామరాజు, ఏపీఓ శ్రీధర్, పాఠశాల ప్రిన్సిపాల్ మరియ జోసెఫ్, వ్యాయామ ఉపాధ్యాయులు కిరణ్, అశోక్, హనుమంతరావు, పాండ్య పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అక్రమాలు

రికవరీకి ఆదేశాలు

బచ్చన్నపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అక్రమాలు జరిగినట్టు అధికారులు గుర్తించారు. శుక్రవారం రాత్రి వరకు జరిగిన మండల ప్రజావేదికలో బాధ్యులపై పెనాల్టీ వేయటంతో పాటు పక్కదారి పట్టిన నిధులను రికవరీ చేసేందుకు ఆదేశాలు జారీ చేశారు. మండల పరిధిలోని 26 గ్రామ పంచాయతీల పరిధిలో 1ఏప్రిల్ 2023 నుంచి 31 మార్చి 2024 వరకు జరిగిన పనులపై గ్రామాలలో తనిఖీ బృందాలు సేకరించిన సమాచారంను ప్రజా వేదికలో టీం లీడర్లు వివరించారు. మన్‌షాన్‌పల్లి, లక్ష్మాపూర్ గ్రామాల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జగాయని తేలింది. ముఖ్యంగా చేయని పనులకు బిల్లులు చేయటం, కూలీల వద్ద నుంచి ఫీల్డ్ అసిస్టెంట్‌లు డబ్బులు తీసుకోవటం, హైదరాబాద్‌లో నివాసముంటున్న వారి పేర్లు మస్టర్‌లో నమోదు చేయటం లాంటి వివరాలు బయటపడ్డాయి. ఇందులో ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, కంప్యూటర్ ఆపరేటర్లు, పంచాయతీ కార్యదర్శుల నుంచి రికవరీకి ఆదేశించారు. ఆలీంపూర్ రూ.11,239, బచ్చన్నపేట రూ. 24,587, బండనాగారం రూ. 3,945, బసిరెడ్డిపల్లి రూ.10,255, బోనకొల్లూరురూ. 3,306, చిన్నరామన్చర్ల రూ. 15,012, దబుకుంటపల్లి రూ. 816, గంగాపూర్ రూ.514, గోపాల్ నగర్ రూ.14,159, ఇటుకాలపల్లిరూ. 7,309, కట్కూరు లేవు, కేశిరెడ్డిపల్లి రూ.4,610, కొడవటూరు రూ. 15,394, కొన్నె రూ. 1,602, లక్ష్మాపూర్ రూ. 48,263, లింగంపల్లి రూ. 1,863, మన్‌షాన్‌పల్లి రూ. 1,52,817, నాగిరెడ్డిపల్లి రూ.2,694, నక్కవానిగూడెం రూ.6,070, నారాయణపూర్ రూ.2,279, పడమటికేశ్వాపూర్ రూ.17,480, పోచన్నపేట రూ. 1,543, రాంచంద్రాపూర్ రూ. 41,131, సాల్వాపూర్ రూ. 8,518, తమ్మడపల్లి రూ.7,734, వీఎస్‌ఆర్ నగర్ రూ. 16,205 మండల వ్యాప్తంగా రూ. 4,19,347 లను రికవరీ చేయాలని ఆదేశించారు.



ప్రజావేదికలో వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

- మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్
- సీఎం కప్ పోటీలు, చంద్రుతండా జీపీ ప్రారంభం



సీఎం కప్ పోటీలు ప్రారంభించి కబడ్డీ ఆడుతున్న ఎమ్మెల్యే

కేసముద్రం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మహిళా సాధికారతే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. కేసముద్రం వ్యవసాయ మార్కెట్ ఆవరణలో ఐకేపీ మహిళలు జినుకల సునీత, పింగిళి స్వాతి, జ్యోతి ఏర్పాటు చేసిన 'మహిళా శక్తి క్యాంటిన్'ను ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. గతనెల 30న 'హడావుడి చేశారు.. ప్రారంభించడం మరిచారు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంతో స్పందించి ఎట్టకేలకు ఈ క్యాంటిన్ ప్రారంభమైంది. అంతకుముందు అమినాపురంలో సీఎం కప్ పోటీల్లో భాగంగా ఎమ్మెల్యే కబడ్డీ ఆటఆడి ప్రారంభించారు. అమినాపురం నుంచి డీసీసీ ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎడ్లబండ్లపై ర్యాలీగా మార్కెట్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి ఎంపీడీవో కార్యాలయం రైతువేదికలో ప్రజాపాలన వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం వెంకటగిరి శివారు నూతన చంద్రుతండా గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మహిళలను చిన్నచూపు చూసిందని ఆరోపించారు. మహిళలు స్వశక్తితో ఆర్థికంగా ఎదిగేందుకు ఈ క్యాంటిన్లను ఏర్పాటు చేశామని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల ప్రతిభను వెలికితీసి ఒలంపిక్స్ స్థాయికి పంపేందుకే సీఎంకప్ నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమాల్లో మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, టీపీసీసీ సభ్యుడు గుగులోత్ దస్రూనాయక్, డీసీసీ ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, బండారు దయాకర్, కదిరె సురేందర్, బండారు వెంకన్న, ఎండీ.అయాబ్‌ఖాన్, చిదిరాల వసంతరావు, ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఎర్రయ్య, ఎంపీడీవో క్రాంతి, ఎస్‌ఐ మురళీధర్‌రాజ్, మార్కెట్ ప్రత్యేక హోదా కార్యదర్శి అమరలింగేశ్వర్‌రావు, ఐకేపీ ఏపీఎం రాజిర్, కార్యదర్శి అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

- ఇనుగుర్తి : ఇనుగుర్తి జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో రెండు రోజులపాటు నిర్వహించే సీఎంకప్ పోటీలను డిప్యూటీ తహసీల్దార్ రవి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈవో రూపారాణి, గురుకులం ప్రిన్సిపాల్ జయశ్రీ, మాజీ సర్పంచ్ దార్ల రాంమూర్తి, సొసైటీ చైర్మన్ దీకొండ వెంకన్న, గంజి రాజేందర్‌రెడ్డి, చిన్నాల కట్టయ్య, కొట్టం మహేందర్, రాము, బేతమల్ల చంద్రయ్య, కార్యదర్శి లక్ష్మీకాంత్, పీఎస్ హెచ్‌ఎం వీరన్న, ఉమ్మగాని మధు పాల్గొన్నారు.

కొండాయి వాసులకు ఇందిరమ్మ ఇళ్లు



పెసా గ్రామసభలో మాట్లాడుతున్న కొమురం ప్రభాకర్

ఏటూరునాగారం రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జంపన్నవాగు ఉగ్రరూపానికి 2023లో నిరాశ్రయులైన ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం కొండాయి వాసులకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మించాలని పెసా గ్రామసభ ఏకగ్రీవ తీర్మానం చేసింది. కొండాయిలో పెసా కమిటీ సభ్యుడు బొచ్చు నాగయ్య అధ్యక్షతన శనివారం గ్రామసభ నిర్వహించగా జిల్లా కో ఆర్డినేటర్ కొముురం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పెసా చట్టం ద్వారా స్థానిక స్వపరిపాలన, స్వయం నిర్ణయ అధికారం, గ్రామసభలను ఏర్పాటు చేసుకొని హక్కులు, చట్టాలను, సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకొనే విధంగా పెసా చట్టం రూపాంతరం చెందిందన్నారు. ఈ గ్రామసభలో పలు అంశాలను చర్చించి తీర్మానాలు చేశారు. గ్రామంలో 300 మందికి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, మినీ మేడారం జాతర సందర్భంగా కొండాయి నుంచి మేడారం వరకు బీటీ రోడ్డు, రెవెన్యూ, ఆర్వోఎఫ్‌ఆర్ పట్టాభూములకు గిరి వికాసం పథకం వర్తింపచేయడం, దొడ్ల- కొండాయి గ్రామాల మధ్య బ్రిడ్జి నిర్మాణం తదితర అంశాలపై పెసా గ్రామసభలో తీర్మానించారు.

బీడీ శర్మ వర్ధంతి

పెసా చట్టం రూపకర్త బీడీ శర్మ 8వ వర్ధంతిని మండలంలో నిర్వహించారు. కొండాయిలో బీడీ శర్మ చిత్రపటానికి పెసా జిల్లా కో ఆర్డినేటర్ కొముురం ప్రభాకర్ పూలమాల వేసి నివాళులర్పించారు. పెసా చట్టం రూపకల్పనలో బీడీ శర్మ విశేషంగా కృషి చేసి, ఆదివాసుల ఆత్మబంధువుగా నిలిచారని కొనియాడారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచు కాక వెంకటేశ్వర్లు, గ్రామస్థులు ఆలం గణపతి, దబ్బగట్ల రాజారాం తదితరులు పాల్గొన్నారు.



ఉప్పుగల్లులో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

జఫర్‌గఢ్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలను అభివృద్ధిలో ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. శనివారం జఫర్‌గఢ్ రెవెన్యూ కార్యాలయం ఆవరణలో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కడియం మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా గెలిచిన ఏడాదిలోనే నియోజకవర్గంలో అభివృద్ధి పనుల కోసం రూ.750 కోట్ల నిధులను ప్రభుత్వంచే మంజూరు చేయించినట్లు వివరించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ప్రతీ గ్రామంలో అర్హులైన పేదలందరికీ పక్కా ఇళ్లను ఈ నెలలోనే మంజూరు చేస్తామన్నారు. అధికారం కోల్పోయామన్న అక్కసుతో బీఆర్‌ఎస్, అధికారం కోసం బీజేపీ నేతలు ప్రభుత్వంపై అర్థంలేని, అనవసర విమర్శలు, ఆరోపణలు చేస్తున్నారన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఉప్పుగల్లు, తీగారం, జఫర్‌గఢ్‌లలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి శంకుస్థాపన చేశారు. ఉప్పుగల్లులో సీసీ రోడ్డు, శివారు పల్లె మాసిరెడ్డిగూడెంలో అంగన్‌వాడీ నూతన భవనం నిర్మాణం, తీగారంలో పంచాయతీ నూతన భవనం, సీసీ రోడ్ల నిర్మాణం, జఫర్‌గఢ్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు అధికారులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తుల సమక్షంలో శంకుస్థాపన చేశారు. కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య శిరీష్‌రెడ్డి, వైస్ చైర్మన్ నూకల ఐలయ్య, సొసైటీ చైర్మన్ టి.కరుణాకర్‌రావు, స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ రాధాకిషన్, ఎంపీడీఓ సుమన్, తహసిల్దార్ శంకరయ్య, మాజీ ఎంపీపీ సుదర్శన్, నాయకులు ఏ భిక్షపతి, మంచాల ఎల్లయ్య, కుల్ల మోహన్ రావు, అయోధ్య సత్తిరెడ్డి, జయపాల్‌రెడ్డి, ఎస్ అశోక్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమ దిశగా ప్రభుత్వ పాలన

- ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య
- రూ.1.20 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కోరం కనకయ్య

బయ్యారం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఏడాదిగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం దిశగా పాలన కొనసాగిస్తున్నట్లు ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అభిప్రాయపడ్డారు. బయ్యారం మండల వ్యాప్తంగా రూ. 1.18 కోట్ల నిధులతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు శనివారం ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు. తొలుత రామచంద్రాపురం పంచాయతీ నారాయణపురంలో రూ. 10 లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అదే విధంగా కంబాలపల్లి పంచాయతీ కొత్తూరులో రూ. 15 లక్షలతో, అల్లిగూడెం గ్రామంలో రూ. 22 లక్షలతో, జగత్‌రావుపేట గ్రామంలో రూ. 10 లక్షలతో, కొత్తగూడెం పంచాయతీ లింగగిరి గ్రామంలో రూ. 15 లక్షలతో, కోటగడ్డ గ్రామంలో రూ. 10 లక్షలతో, గంధంపల్లి, క్రొపేట గ్రామాల్లో రూ. 36.05 లక్షలతో చేపట్టే సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం కోయగూడెం గ్రామంలో నిర్మించిన అంగన్వాడీ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ క్రమంలోనే ప్రజా పాలన విజయోత్సవ సంబరాల్లో భాగంగా గంధంపల్లి కొత్తపేట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ఇటీవల ఉద్యోగ నియామకం పొందిన ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు. ఎమ్మెల్యే వెంట పీఏసీఎస్ చైర్మన్ మూల మధుకర్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ నాయకులు ముసలయ్య, ప్రభాకర్ రెడ్డి, ప్రవీణ్ నాయక్, సురేష్, భాస్కర్, మంగీలాల్, క్రిష్ణ, మోహన్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుతో వృద్ధురాలి మృతి



లచ్చమ్మ (ఫైల్)

మొగుళ్లపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పాముకాటుతో వృద్ధురాలు మృతి చెందిన సంఘటన భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలో చోటుచేసకుంది ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. మొట్లపల్లి గ్రామానికి చెందిన జన్నె లచ్చమ్మ(80 ఇంట్లో నిద్రిస్తున్న క్రమంలో పాము కుడిచేతికి కాటువేసింది. దీంతో ఆమె ఒక్కసారిగా కేక వేసింది. కుటుంబ సభ్యులు గమనించి ఆమెను చిట్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పరకాలకు రెఫర్ చేశారు. ఈక్రమంలో లచ్చమ్మ చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి కుమారుడు సమ్మయ్య ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

అమలు కాని హామీలతో కాంగ్రెస్ మోసం

- నర్సంపేట అభివృద్ధిని విస్మరిస్తున్న ఎమ్మెల్యే
- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ధ్వజం

నర్సంపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఏడాది పాలనలో ప్రజలకు నిరాశే మిగిలిందని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఎన్నికల హామీల అమలుకు నోచుకోని తీరుకు నిరసనగా పట్టణంలోని సిటిజన్స్ క్లబ్ ఫంక్షన్ హాల్‌లో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ది మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీలు, 420 హామీలు ఇచ్చిన కాంగ్రెస్.. వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. ఎన్నికల సమయంలో కౌలు రైతులకు రూ.12వేలు, కూలీలకు రూ.10వేలు, మహిళలకు రూ. 2500 ఇస్తామని ఇచ్చిన హామీలు అమలుచేయకుండా ప్రజలకు ప్రభుత్వం చుక్కలు చూపిస్తోందన్నారు. అభివృద్ధి, మార్పు కోసం కాంగ్రెస్‌ను గెలిపిస్తే ముఖ్యమంత్రికి, స్థానిక ఎమ్మెల్యేకు సఖ్యతలేనట్టు నటిస్తూ, చీకటి ఒప్పందాలతో నర్సంపేట అభివృద్ధిని విస్మరిస్తున్నారని విమర్శించారు. నర్సంపేటలో అభివృద్ధి, సంక్షేమం ఆగిపోయిందన్నారు. అవినీతి, అక్రమ కేసులు, పోలీసుల రాజ్యం నడుస్తోందన్నారు. మునిసిపాలిటీ అభివృద్ధి కోసం తాను తీసుకువచ్చిన నిధులను సొంత కాంట్రాక్ట్ సంస్థతో ఎమ్మెల్యే దొంతి పనులు చేయిస్తున్నారని ఆరోపించారు. గిరిజన తండాలకు, మారుమూల గ్రామాలకు బీటీ రోడ్లను మంజూరు చేయిస్తే వాటిని రద్దుచేసి పనులను నిలిపివేశారన్నారు. లాభాల కోసం ప్రస్తుత ఎమ్మెల్యే సొంత కాంట్రాక్టు సంస్థతో మళ్లీ టెండర్లు పిలి పించుకున్నారని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో జీవో 346 ద్వారా రూ.75కోట్లతో ప్రత్యేకంగా నర్సంపేట నియోజకవర్గానికి వ్యవసాయ యాంత్రీకరణ ప్రాజెక్టును తీసుకువచ్చానని అన్నారు. అందులో రూ.16 కోట్లు ఖర్చు కాగా, మిగతా రూ. 59కోట్ల నిధులు వెనక్కి పోవడం దురదృష్టకరమన్నారు. ఈ విషయంపై వ్యవసాయశాఖ మంత్రికి లేఖరాశానన్నారు. రైతులకు ఉపయోగపడే పైలట్ ప్రాజెక్టును ఆపేశారన్నారు. పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానని పార్టీ పిలుపునిచ్చే కార్యక్రమాలను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులను ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఓడీసీఎంఎస్ చెర్మన్ రామస్వామి నాయక్, జడ్పీ వైస్‌చైర్మన్ ఆకుల శ్రీనివాస్, పార్టీ నాయకులు రాయిడి రవీందర్‌రెడ్డి, నాగెల్లి వెంకటనారాయణగౌడ్, గోనె యువరాజ్. డాక్టర్ లెక్కల విద్యాసాగర్‌రెడ్డి, బానోతు సారంగపాణి, మచ్చిక నర్సయ్య గౌడ్, ఊడ్గుల ప్రవీణ్, నియోజకవర్గంలోని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

తెలంగాణతల్లిని అవమానపరుస్తున్న సీఎం

రూపాన్ని మార్చి తెలంగాణ తల్లిని సీఎం రేవంత్‌రెడ్డి అవమానిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ తల్లిరూపాన్ని మార్చడాన్ని, అంబేద్కర్ జయంతి రోజు ఆయన విగ్రహానికి నివాళులర్పించకుండా అడ్డుకున్న ప్రభుత్వ తీరును నిరసిస్తూ నర్సంపేట పట్టణంలోని తెలంగాణ తల్లి, అంబేద్కర్ విగ్రహాలకు బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి క్షీరాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. అణచివేత పద్ధతిలో తెలంగాణ విగ్రహం రూపాన్ని మార్చాలనుకోవడం కాంగ్రెస్‌కు తగద న్నారు. రాష్ట్రంలో 6500 సెంటర్లలో, నర్సంపేట నియోజకవర్గంలో 40 సెంటర్లలో తెలంగాణ తల్లి విగ్రహాలను ఏర్పాటు చేసి దైవంగా పూజించామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు.



నర్సంపేటలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

సండే స్పెషల్
SUNDAY SPECIAL



స్మార్ట్ పడగ!

సెల్ ఫోన్లకు బానిసలవుతున్న జనం

- పిల్లల నుంచి పెద్దల వరకూ అదే 'మాయ'లో..
- 90 శాతం మంది పిల్లలపై అధిక ప్రభావం
- నాడీ సంబంధ సమస్యలు తలెత్తే ప్రమాదం
- నయనాలకు నష్టమని తెలిసినా వదలని వైనం
- మితిమీరిన వాడకంతో దెబ్బతింటున్న బాంధవ్యాలు

నర్సింహులపేట / గార్ల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జీవితం ఆధునికత వైపు అడుగులేస్తోందని ఆనందపడాలో.. అదే ఆధునికత జీవితాన్ని చీకటిమయం చేస్తోందని బాధపడాలో అర్థం కాని పరిస్థితి. ప్రస్తుతం ప్రపంచాన్ని స్మార్ట్ యుగం శాసిస్తున్న సమయంలో పిల్లల నుంచి పెద్దల వరకు తెలియకుండానే స్మార్ట్ ప్రపంచంలోకి జారిపోతున్నారు. ఉపయోగాలు ఎన్ని ఉన్నాయో నష్టాలూ అన్నే ఉన్నాయన్న విషయాన్ని పక్కనపెట్టి బానిసలుగా మారుతున్నారు. ముఖ్యంగా చేతిలో మొబైల్ ఫోన్ లేనిదే రోజు గడవని వారున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. చివరకు నెలల వయసున్న చిన్నారులు కూడా స్మార్ట్‌ఫోన్‌లో బొమ్మల వీడియోలు, రైమ్స్ లాంటివి చూపించనిదే పాలు తాగడం లేదు.. ఆహారం తీసుకోవడం లేదంటే ఏమేరకు స్మార్ట్ ఫోన్లు మన జీవితాలను కమ్మేశాయో చూడాలి. మానవ మనుగడ సాగాలంటే గాలి, నీరు, వెలుతురు, ఆహారం ఎంత ముఖ్యమో.. ప్రస్తుతం సెల్‌ఫోన్ అంతకంటే ముఖ్యమైపోయింది. మన దేశ జనాభాకు మూడింతలు సెల్‌ఫోన్లు ఉన్నాయని సర్వేలో తేటతెల్లమైంది. మొబైల్ ఫోన్ల వల్ల కూడ మానవ సంబంధాలు కనుమరుగై పోతున్నాయి. ఒకరితో ఒకరు ఆప్యాయంగా మాట్లాడుకునేది పోయి.. పొట్టి సందేశాలతో పలకరింపులు జరిగిపోతున్నాయి.

మేలుకోకుంటే ప్రమాదమే..

పిల్లలు సెల్‌ఫోన్లు వాడే విషయంలో జాగ్రత్తలు పాటించకుంటే పెను ప్రమాదాలే ఎదుర్కొకతప్పదు. కొందరు తల్లిదండ్రులైతే మా పిల్లవాడు ఏడాది వయస్సు నుండే మొబైల్ ఆపరేట్ చేసేస్తున్నాడండీ అంటూ గొప్పలు చెప్పకుండా నష్టాన్ని అంచనా వేసి ముందుకు సాగాలి. వీలైనంత వరకు వారిని సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచాలి. నిద్రపోయే గదిలో టీవీ, ఐప్యాడ్, ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్ల లాంటివి ఉంచకూడదు. ఇన్‌డోర్, అవుట్‌డోర్ గేమ్స్‌కు అలవాటు చేయాలి. డ్యాన్స్, మ్యూజిక్ లాంటి వాటిపై దృష్టి సారించేలా చూడాలి. అల్పాహారం, భోజనం తీనే సమయంలో టీవీ, ఫోన్ చూడటం లాంటివి చేయకుండా చూసుకోవాలి. ముఖ్యంగా పెద్దలు పిల్లల ముందు మొబైల్ ఫోన్లు వాడటం మానాలి. వారాంతంలో పిల్లలతో ఎక్కువ సమయం గడపాలి. వారితో మమేకమై ఆట పాటలతో వారి దృష్టిని మళ్లకుండా చూసుకోవాలి.

ఓ సర్వేలో విస్తుపోయే విషయాలు

ఇటీవల ఓ ప్రముఖ స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ, సైబర్ మీడియా రిసెర్చ్ (సీఎంఆర్)తో కలిసి ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, అహ్మదాబాద్, పుణె నగరాల నుంచి 1500కు పైగా నమూనాలను సేకరించారు. సర్వే ప్రకారం 12 ఏళ్లకు పైబడిన పిల్లలు స్మార్ట్ ఫోన్లను ఎక్కువగా వాడుతున్నారని, వారు రోజుకు సగటున 5, 6 గంటలపాటు ఫోన్‌లో లీనమౌతూ ఎక్కువ సమయం గేమ్స్‌కే కేటాయిస్తున్నారని తేలిసింది. 90 శాతం మంది పిల్లలు ఇంట్లో ఉంటే ఫోన్‌తప్ప మరో ధ్యాస ఉండడం లేదని, చాలామంది మానసిక ఆరోగ్యం దెబ్బతింటుందని 94 శాతం మంది తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

కళాశాల, పాఠశాలస్థాయి పిల్లల్లో 83 శాతం మంది నిద్రలేవగానే సెల్‌ఫోన్‌తో గడిపేస్తున్నారు. 63శాతం మంది నిద్రపోయే ముందు ఫోన్ చూస్తున్నారు. తల్లిదండ్రుల విషయానికి వస్తే 87, 73 శాతం మంది స్మార్ట్‌ఫోన్లు వాడుతూ పిల్లలతో రోజుకు సగటున 2 గంటలు మాత్రమే కేటాయిస్తున్నారు. కళాశాల స్థాయి విద్యార్థులు పాఠశాల స్థాయి పిల్లలు 58 శాతం మంది స్నేహితులతో కనెక్ట్ అయ్యేందుకు స్మార్ట్‌ఫోన్లు వాడుతున్నారు.

దెబ్బతింటున్న బంధుత్వాలు.. ఎదురవుతున్న ఆరోగ్య సమస్యలు..

సెల్‌ఫోన్ అతిగా వాడటంతో బంధుత్వాలపై తీవ్ర ప్రభావం పడుతోందని విశ్లేషకులు చెబుతున్నారు. 90 శాతం మంది పెద్దలు, పిల్లలు స్మార్ట్‌ఫోన్‌లో కాలం గడిపేస్తుండటంతో ఇతరులతో సంబంధం లేదన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా కుటుంబ బాంధవ్యాలను కూడా పట్టించుకోకుండా ఒంటరవుతున్నాడని తాజా అధ్యయనంలో వెల్లడవం ఆందోళన కలిగించే అంశం. పిల్లలతో పాటు పెద్దల్లో ప్రధానంగా దృష్టిలోపం వస్తోంది. మొబైల్ ఫోన్‌ను కళ్లకు అతిదగ్గరగా పెట్టుకొని చూస్తుండటం, చీకటిలో ఎక్కువగా చూడటం లాంటి వాటి వల్ల కంటిచూపు కోల్పోతున్నారని వైద్య నిపుణులు చెబుతున్నారు. మరోపక్క ఊబకాయం పెరిగిపోతుంది. తలనొప్పి. మెదడు సంబంధ సమస్యలు, నిద్రలేమి, నాడీ వ్యవస్థ దెబ్బతినడం లాంటివి కూడా వస్తున్నాయి.

సెల్ ఫోన్ అతిగా వాడితే ప్రమాదమే..

దారం రవీందర్, రేడియాలజిస్టు, వరంగల్



సెల్‌ఫోన్ మితిమీరిన వాడకంతో రేడియేషన్ తీవ్రతవల్ల అనారోగ్య సమస్యలు వస్తాయి. ప్రధానంగా కంటి చూపు తగ్గడంతో పాటు క్యాన్సర్, గుండె, మెదడు మందగించడం, పని విధానం తగ్గడం, స్త్రీలల్లో గర్భకోశ వ్యాధులు అధికంగా వస్తాయి. స్మార్ట్‌ఫోన్ వాడకం తగ్గించుకోకుంటే మానవ మనుగడకు ప్రమాదం తప్పదు. ఒక్క ఆరోగ్య పరంగానే కాదు సైబర్ పట్ల అప్రమత్తంగా ఉండాలి.

టైప్‌రైటర్.. కనుమరుగు

కంప్యూటర్ రాకతో కాలగర్భంలోకి..



ఒకప్పుడు ప్రభుత్వ కార్యాలయాల్లో టైప్‌రైటర్ చేసే 'టక..టక..'అనే శబ్దంతో కళకళలాడుతూ ఒకరకమైన హడావుడి ఉండేది. కాలక్రమేణా కంప్యూటర్, ప్రింటర్ రాకతో టైప్ రైటర్ కాల గర్భంలో కలిసిపోయింది. ఇప్పుడు చూద్దామన్నా టైపింగ్ యంత్రం ఎక్కడా కానరావడంలేదు. నూతన సాంకేతికతతో అంతరించిపోయిన పరికరాల జాబితాలో టైప్‌రైటర్ ఎప్పుడో చేరింది. భవిష్యత్తులో దీన్ని మ్యూజియంలో చూడాల్సి వస్తుందేమో. ఒకప్పుడు కార్యాలయ టేబుల్‌పై హుందాగా ఉన్న టైప్‌రైటర్ కేసముద్రం ఎంపీడీవో కార్యాలయం స్టోర్‌రూంలో నిశబ్దంగా అవసాన స్థితిలో కనిపించడంతో టైపింగ్ అభిమానులు అయ్యో...! కాలం ఎంత చిత్రమైందని అనుకుంటున్నారు.

- కేసముద్రం, ఆంధ్రజ్యోతి

కృష్ణవేణికి గోల్డ్‌మెడల్

ఇంటర్నేషనల్ సిట్టింగ్ పారా త్రోబాల్‌లో పతకం

స్టేషన్‌ఘన్‌పూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పుట్టుకతోనే రెండు కాళ్లు చచ్చుబడిపోయినా జీవన ప్రయాణంలో ఆధైర్యపడకుండా విశ్వనాథ పురం గ్రామానికి చెందిన మాచర్ల ఎల్లయ్య కుమార్తె, మాచర్ల కృష్ణవేణి ఇంటర్నేషినల్ పారా త్రోబాల్‌లో గోల్డ్‌మెడల్ సాధించింది. గత నెల 30న కృష్ణవేణి కాంబోడియా వెళ్లింది. ఈనెల 2వ నుంచి 5 వరకు జరిగిన పోటీలో అత్యంత ప్రతిభ, నైపుణ్యాలను కనబరిచి గోల్డ్‌మెడల్ సాధించి సత్తా చాటింది. 5న రాత్రి అక్కడి అధికారుల చేతుల మీదుగా కృష్ణవేణి గోల్డ్‌మెడల్ అందుకున్నారు. గోల్డ్‌మెడల్ సాధించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

రైసు మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, దాత బెలిదె వెంకన్న కృష్ణవేణికి ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. రానున్న రోజుల్లో కృష్ణవేణికి సాయం అందించి పారా ఒలంపిక్స్ క్రీడల్లో పోటీపడాలే తర్ఫీదును తీసుకునేలా కృషి చేస్తామని తెలిపారు. జాతీయ స్థాయిలో రాణించి కాంబోడియా దేశంలో జరిగే ప్రపంచ స్థాయి పోటీలకు సెలెక్ట్ కావడంతో పాటు పోటీలకు రావాలని అక్కడి నుంచి పిలుపువచ్చింది. పేద కుటుంబానికి చెందిన క్రిష్ణవేణి అక్కడికి వెళ్లేందుకు డబ్బులు లేకపోవడంతో అక్టోబరులో ఎమ్మెల్యే కడియం శ్రీహరికి రూ.1.05లక్షల ఆర్థిక సాయం అందించారు.



గోల్డ్‌మెడల్ అందుకుంటున్న కృష్ణవేణి



భద్రకాళి ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



ఊకల్‌లో స్వామికి తలంబ్రాలు సమర్పిస్తున్న శ్రీధర్‌బాబు

కనుల పండువగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం

వేడుకలకు హాజరైన మంత్రి, ఎమ్మెల్యేలు

వరంగల్ కల్చరల్/గీసుగొండ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మార్గశిర మాసం షష్టి పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం నాగేంద్రస్వామి దేవాలయాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. బ్రాహ్మీ ముహూర్తం నుంచే సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి వేద మంత్రాలతో అభిషేకం, అలంకరణ, హారతులు నిర్వహించారు. అనంతరం శ్రీవల్లీదేవ సేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి కల్యాణం జరిపించారు. గీసుగొండ మండలంలోని ఊకల్ నాగేంద్రస్వామి ఆలయంలో శనివారం సుబ్రహ్మణ్యేశ్వర, వల్లీదేవి, దేవాసేనాదేవి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కల్యాణానికి ముందు ఉత్సవమూర్తులకు ఎదుర్కోళ్లు, ఊరేగింపు నిర్వహించారు. అనంతరం పల్లకీలో కల్యాణవేదికకు తోడ్కొని వచ్చారు. కల్యాణోత్సవాన్ని జ్యోతిష్యరత్న సముద్రాల సుదర్శనాచార్యులు కన్నుల పండువగా జరిపించారు. వేలాదిమంది భక్తులు తరలివచ్చి వేడుకలను తిలకించారు. ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్‌రెడ్డి, కేఆర్ నాగరాజు హాజరై స్వామివారికి తలంబ్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు శ్రీహర్షాచార్యులు, ఆలయ కమిటీ చైర్మన్ మాచినపెల్లి బాబురావు, కోశాధికారి కొత్తగట్టు రాజేందర్, మాచినపెల్లి మోతయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణోత్సవాలు

వరంగల్ ఎల్లం బజార్‌లోని ప్రసిద్ధ శ్రీనాగేంద్రస్వామి దేవాలయం, ఉర్సులోని నాగేంద్రస్వామి దేవాలయం, శివనగర్‌లోని నాగేంద్రస్వామి దేవాలయం, బట్టల బజార్ వెంకటేశ్వరస్వామి ఆలయంలోని నాగేంద్రస్వామి, ఓసిటీలోని నాగేంద్రస్వామి, శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి, రామన్నపేటలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మ వారి ఆలయంలో గల శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామికి, ములుగు రోడ్‌లోని కన్నెమూల గణపతి దేవాలయం సమీపంలో నాగేంద్రస్వామి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి విశేష అభిషేకం పూజల అనంతరం కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో వేయి అరటిపండ్లతో సహస్రనామార్చన నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పెద్ద సంఖ్యలో భక్తులు ఉపవాసాలతో స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. సంతానం లేనివారు, వివాహం కానివారు స్వామి వారి కల్యాణంలో పాల్గొని పూజలు నిర్వహించారు.

భద్రకాళిదేవాలయంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. అర్చక బృందం స్వామివారికి అభిషేకం అలంకరణ అనంతరం వల్లీదేవసేన సుబ్రహ్మహ్యేశ్వర స్వామి దేవతామూర్తులకు కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రధానార్చకులు భద్రకాళి శేషు, ఈవో శేషు భారతి, ఆలయ సూపరిండెంటెంట్ అద్దంకి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళిలో ధ్యాన మందిరం

- చెరువు మధ్యలోని ద్వీపంపై నిర్మాణం
- ఐల్యాండ్ నుంచి మాడవీధిని కలుపుతూ కేబుల్ బ్రిడ్జి
- 2005లోనే తయారైన డీపీఆర్‌కు కొత్త మెరుగులు



భద్రకాళి చెరువు మధ్యలో ఉన్న ఐల్యాండ్ (ద్వీపం)

హనుమకొండ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : భద్రకాళి చెరువు సుందరీకరణలో భాగంగా భద్రకాళి చెరువు మధ్యలో ఉన్న ఐలాండ్ (ద్వీపం)పై ధ్యాన మందిరాన్ని నిర్మించాలన్న ప్రతిపాదన మరోసారి తెరమీదికి వచ్చింది. 2005లోనే ఈ ప్రతిపాదనకు బీజం పడింది. అప్పట్లోనే కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ ఈ మేరకు రూ.2కోట్లతో డిటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్)ను రూపొందించింది. అప్పట్లో నిధుల కొరతవల్ల కార్యరూపం దాల్చలేదు. ఇప్పుడు తాజాగా డీపీఆర్ మరోసారి పరిశీలనకు వచ్చింది. అయితే మారిన పరిస్థితులు, ఇప్పటి అవసరాల దృష్ట్యా ఈ డీపీఆర్‌ను సవరించి మరింత ఆధునిక పద్ధతుల్లో ఐలాండ్‌ను అభివృద్ధి చేయాలని యోచిస్తున్నారు. సరిగ్గా చెరువు మధ్యలో ఉండే ఈ ఐలాండ్ (మట్టి దిబ్బ) సుమారు 2 నుంచి 3 ఎకరాల వరకు ఉంటుందని అంచనా. దీనిపై ధ్యానమందిరాన్ని నిర్మిస్తారు.

2015లో చెరువులోని నీరు పూర్తిగా ఇంకిపోయినప్పుడు ఈ ద్వీపం స్వరూపం, స్వభావం పూర్తిగా బయటకు వచ్చింది. అప్పట్లో అధికారులు ఈ దిబ్బమీదకు వెళ్లి పరిశీలన కూడా చేశారు. ఆ ప్రాంతాన్ని పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా జరిపిన తవ్వకాల్లో కొన్ని ప్రాచీన శిల్పాలు కూడా బయట పడ్డాయి. ధ్యాన మందిరం నిర్మాణానికి ఐలాండ్ అనువుగా ఉందన్న నిర్ధారణకు అధికారులు అప్పుడే వచ్చారు. ఆ తర్వాత వర్షాల వల్ల చెరువు నీటితో నిండిపోవడం, ఐలాండ్ వద్దకు వెళ్లే అవకాశం లేకపోవడంతో కాలక్రమంలో అక్కడ ధ్యాన మందిరం నిర్మాణం ప్రతిపాదన మరుగున పడింది. ఐల్యాండ్‌లో ధాన్యం మందిరం, అక్కడి నుంచి కేబుల్ బ్రిడ్జి నిర్మాణం జరిగితే భద్రకాళి చెరువు మరో లక్నవరం పర్యాటక ప్రాంతంగా మారుతుంది.

కేబుల్ బ్రిడ్జి

ఐలాండ్ నుంచి భద్రకాళి గుడి మాడవీధిని కలుపుతూ కేబుల్ బ్రిడ్జిని నిర్మించే ప్రతిపాదన కూడా తాజాగా పరిశీలనకు వచ్చినట్టు సమాచారం. ఐలాండ్‌లో ధాన్యమందిరంతో పాటు అక్కడ అందమైన పార్క్‌ను, మ్యూజియం, కేఫెటేరియాను, వీలైతే ఒక కాటేజీని ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన కూడా ఉంది. అయితే అక్కడ అందుబాటులో ఉండే స్థలాన్ని బట్టి వీటి ఏర్పాటు ఉంటుంది. ప్రస్తుతం భద్రకాళి గుడి చుట్టూరా మాఢవీధులను నిర్మిస్తున్నారు. మాఢవీదిలో కొంతభాగం చెరువు మీది నుంచి నిర్మాణమవుతుంది. ఈ మాఢవీధిని కలుపుతూ కేబుల్ బ్రిడ్జిని నిర్మిస్తారు. ఆలయానికి వచ్చిన భక్తులు అమ్మవారి దర్శనం అనంతరం మాడవీధిలో నడుస్తూ చెరువు అందాలను వీక్షించేందుకు వీలు ఏర్పడుతుంది. కేబుల్ బ్రిడ్జిని కూడా నిర్మిస్తే ఈ సందర్శకులు ధ్యాన మందిరానికి చేరుకొని అక్కడ కొద్దిసేపు విశ్రాంతిగా గడిపే అవకాశం ఉంటుంది. ఈ ధ్యాన మందిరం నిర్మిస్తే అది అటు ఆధ్యాత్మిక కేంద్రంగానూ ఇటు పర్యాటక ప్రాంతంగానూ ఉపయోగపడుతుందని అధికారులు భావిస్తున్నారు. భద్రకాళి చెరువు నుంచి తీసే పూడిక మట్టిలో కొంత భాగాన్ని ఈ ఐల్యాండ్ పటిష్టం చేయనున్నారు. చెరువు మట్టిని అక్కడే పోసి దానిని మరింత విస్తరించనున్నారు.

జనవరి రెండో వారంలో పూడికతీత

భద్రకాళి చెరువు పూడికతీత పనులను జనవరి రెండు లేదా మూడో వారం నుంచి మొదలు పెట్టనున్నారు. 350 ఎకరాలకు పైగా విస్తీర్ణం కలిగిన ఈ పురాతన చెరువులో వందేళ్లల్లో ఎప్పుడూ పూడిక తీయలేదు.

నాలుగు దశాబ్దాల కిందట భద్రకాళి చెరువును తాగునీటి జలాశయంగా మార్చేక్రమంలో కొంత మేరకు మట్టితీసి శుభ్రం చేసే ప్రయత్నం జరిగింది కానీ పూర్తి స్థాయిలో పూడిక తీయలేదు. భద్రకాళిని వేసవి రిజర్వాయర్‌గా మార్చక ముందు వేసవిలో కొంత మేరకు ఎండిపోయేది. చెరువులోకి మురుగునీరు చేరకుండా బండ్ నిర్మించిన తర్వాత అటు ధర్మసాగర్ నీరు ఇటు వర్షపు నీరు నిండుగా చేరి ఎప్పుడూ కళకళలాడుతూ కనిపించేది. ఈ క్రమంలో చెరువులో పూడిక తీయడం కష్టంగా మారనున్నట్టు కనిపిస్తోంది.

ఓరుగల్లు పత్తికి మహర్దశ

- వరంగల్‌కు పత్తి పరిశోధన కేంద్రం మంజూరు
- ఆమోదం తెలిపిన భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

ఓరుగల్లు పత్తికి మహర్దశ పట్టనుంది. దేశంలోనే నాణ్యమైన పత్తిని అందించే వరంగల్ రైతులకు రానున్న రోజుల్లో మరింత నాణ్యమైన పత్తి ఉత్పత్తి చేసేలా కేంద్రం దృష్టిసారించింది. ఈ మేరకు వరంగల్‌కు పత్తి పరిశోధన కేంద్రానికి భారత పత్తి పరిశోధన సమన్వయ కేంద్రం (ఏఐసీఆర్‌పీ), భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) ఆమోదం తెలిపాయి. దీంతో ఇక నుంచి ఓరుగల్లు కేంద్రంగా జాతీయ స్థాయిలో పత్తిపై పరిశోధనలు చేయనున్నారు. అంతేకాకుండా కొత్త వంగడాల సాగుతో పాటు చీడపీడల నివారణలపై విస్తృతంగా పరిశోధనలు చేసే అవకాశం లభిస్తుంది. ప్రధానంగా పత్తి పంట చేతికి వచ్చే సమయంలో వేరుతెగుళ్లు, గులాబీ పురుగు ఉధృతితో రైతులు దిగుబడి కోల్పోతున్నారు. ఇలాంటి సమయంలో పరిశోధన కేంద్రంలో వీటిపై వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశోధన చేసి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఓరుగల్లు రైతులకు సలహాలు ఇచ్చే అవకాశం ఉంది.

వరంగల్‌కు పరిశోధన కేంద్రం మంజూరు

పత్తి పంట సాగుకు కేరాఫ్‌గా ఉన్న వరంగల్‌లో పత్తి పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని పదేళ్లుగా డిమాండ్ ఉంది. గత 2020లో వరంగల్‌లో పత్తి పరిశోధన కేంద్రం కోసం గత ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. అయితే ఆ ప్రతిపాదనలు ఢిల్లీకి చేరకముందే బీఆర్ఎస్ ప్రభుత్వం పడిపోయింది. దీంతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే పత్తి పరిశోధన కేంద్రంపై దృష్టిసారించింది. గత నెలలో భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఆర్ఏ) డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షు పాఠక్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ టీపీ.శర్మలను కలిసి వరంగల్‌లో పత్తి పరిశోధన కేంద్రం ఏర్పాటు అవశ్యకతపై ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ అల్దాస్ జానయ్య వివరించారు. దీంతో అఖిల భారత పత్తి సమన్వయ పరిశోధన పథకంలో భాగంగా ఆచార్య జయశంర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం భాగస్వామ్యంతో వరంగల్‌లో పత్తి పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కాగా, పత్తి పరిశోధన కేంద్రం వరంగల్‌కు మంజూరు కావటంతో భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) నుంచి శాస్త్రవేత్తలతో పాటు ఉద్యోగులను నియమించనున్నారు. వీరికి వేతనాలతో పాటు ఇతర సౌకర్యాలను ఐకార్ కల్పించనుంది. అలాగే వరంగల్‌లో పరిశోధనలు చేసేందుకు కేంద్రం నుంచి నిధులు విడుదల చేయనున్నారు. జాతీయ స్థాయిలో సాంకేతికతను పంచుకుంటూ వరంగల్‌లో మరింత నాణ్యమైన పత్తి ఉత్పత్తికి పరిశోధనలు మేలు చేయనున్నాయి. అంతేకాకుండా పత్తి ఆధారిత పరిశ్రమల ఏర్పాటు, మార్కెటింగ్‌కు పరిశోధన కేంద్రం ఉపయోగపడనుంది.

పత్తి రైతుకు వరంగా పరిశోధనలు

అఖిల భారత పత్తి పరిశోధన పథకం(ఏఐసీఆర్) కింద వరంగల్‌లో పత్తి పరిశోధన కేంద్రం, ఆదిలాబాద్‌లో ఉప కేంద్రాన్ని మంజూరు చేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ఈ పరిశోధన కేంద్రం అమల్లోకి రానుంది. దీంతో జాతీయస్థాయిలో పత్తి సాగుపై వరంగల్ కేంద్రంగా పరిశోధనలు చేయనున్నారు. అధిక దిగుబడులను ఇచ్చే సాగు, సమతుల్య ఎరువులు, చీడలు, తెగుళ్ల నివారణ చర్యలు, పరిశోధన కేంద్రం నుంచి అభివృద్ధి చేసిన మెరుగైన రకాల పెంపకం, అధిక నాణ్యత, స్థిరమైన ఉత్పత్తి లక్ష్యంగా ఈ కేంద్రంలో పరిశోధనలు జరగనున్నాయి. 2021నుంచి రైతులు బీజీ-2 పత్తి సాగువైపు మొగ్గు చూపుతున్నారు. అయితే దేశవ్యాప్తంగా 300రకాలకు పైగా బీజీ-2 విత్తనాలు ఉన్నప్పటికీ ఉమ్మడి వరంగల్ జిల్లాలో కేవలం 20 నుంచి 30రకాల బీజీ-2 విత్తనాలనే సాగు చేస్తున్నారు. వీటిపై కూడా ఓరుగల్లులో పరిశోధనలు చేసి, ఈ రకం విత్తనాలు ఇక్కడి భూములకు అనుకూలమో.. కాదో వ్యవసాయ శాస్త్రవేత్తలు వివరించను న్నారు. ఇప్పటికే ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి వ్యవసాయ శాస్త్రవేత్తలు ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా పత్తి పంటతో పాటు మిర్చి, వరి, మొక్కజొన్న, పసుపు తదితర పంటలపై పరిశోధనలు చేస్తున్నారు. తాజాగా పత్తి పరిశోధన కేంద్రం రావటంతో ఐకార్‌తో కలిసి జయశంకర్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు పని చేయనున్నారు. దీంతో వరంగల్‌తో పాటు కరీంనగర్, ఖమ్మం, నల్లగొండ జిల్లా పత్తి రైతుల సమస్యలపై పరిశోధనలు జరగనున్నాయి. ప్రధానంగా వరంగల్ రైతులు వేగు తెగుళ్లతో పాటు గులాబీ పురుగు ఉధృతితో తీవ్రంగా నష్టపోతున్నారు. పంట చేతికి వచ్చే సమయంలో ఈ వైరస్ సోకటంతో దిగుబడి తగ్గుతుంది. దీనిపై పరిశో ధనలు చేసి, రిపోర్టు వచ్చే సరికే పంటకు జరుగాల్సిన నష్టం జరిగిపోతుంది. వరంగల్‌లోనే పరిశోధన కేంద్రం ఉండటంతో స్థానికం గానే టెక్నాలజీతో వరంగల్ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై పరిశోధ నలు చేసి, నివారణ చర్యలు సూచించే అవకాశం ఏర్పడుతుంది. దీంతో వరంగల్ రైతులకు పరిశోధన కేంద్రం వరంగా మారనుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

వ్యవసాయ పరిశోధన స్థానంలోనే..

వరంగల్‌లో ఇప్పటికే వ్యవసాయ పరిశోధన కేంద్రం ములుగురోడ్డులో ఉంది. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా కొనసాగుతుంది. ఈపరిశోధన కేంద్రం నుంచి ప్రధాన శాస్త్రవేత్తలు, శాస్త్రవేత్తలు వివిధ రకాల పంటలపై పరిశోధనలు చేస్తున్నారు. ప్రస్తుతం ఐకార్ ఆమోదం పొందిన పత్తిపరిశోధన కేంద్రాన్ని కూడా ఇక్కడి నుంచే కొనసాగించే అవకాశం ఉంది. ఈ పరిశోధన కేంద్రంలో ప్లాంట్ బ్రీడింగ్, ఎంటమాలజీ, అగ్రనామి తదితర డిపార్ట్‌మెంట్‌లు ఏర్పాటు అయ్యే అవకాశం ఉంది. దీనిలో ముగ్గురు ప్రధాన శాస్త్రవేత్తలు, ఆరుగురు శాస్త్రవేత్తలు, ఇద్దరు ఏఈవోలు, ఇతర ఫీల్డ్ స్టాఫ్‌ను మంజూరు చేయనున్నారు. మొత్తానికి ఎన్నో ఏళ్లగా ఓరుగల్లు రైతులు ఎదురుచూస్తున్న పత్తి పరిశోధన కేంద్రం వరంగల్‌కు మంజూరు కావటం పట్ల రైతుల్లో హర్షం వ్యక్తం అవుతుంది.



పత్తికి కేరాఫ్ ఓరుగల్లు

తెలంగాణలోనే అత్యధికంగా పత్తి సాగయ్యే జిల్లాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా మొదటి స్థానంలో ఉంటుంది. గతంలో వరంగల్‌లో పత్తి ఆధారిత పరిశ్రమలు పుష్కలంగా ఉండేవి. దీంతో చాలా ఏళ్ల నుంచి పత్తి సాగుకే రైతులు మొగ్గుచూపుతూ వస్తున్నారు. 2024-25 సంవత్సరంలో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 5,13,289 ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేశారు. ఈ సీజన్‌లో అకాలవర్షాలతో పాటు గులాబీ పురుగు ఉధృతి, వేరుతెగుళ్ల వ్యాధులతో పత్తి దిగుబడి భారీగా తగ్గింది.

దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ఈ సీజన్‌లో 4,10,632 మెట్రిక్ టన్నుల పత్తి దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. దేశంలో ఇతర ప్రాంతాలతో పోలిస్తే వరంగల్ పత్తికి నాణ్యత ఎక్కువ. వరంగల్ పత్తి పింజ పొడువు 29 మి.మీల నుంచి 30.5మి.మీలకు పైగానే ఉంటుంది. అయితే గుజరాత్, పంజాబ్, మహారాష్ట్ర తదితర ప్రాంతాల్లో గరిష్టంగా పత్తి పింజ పొడువు 29మి.మీల వరకే ఉంటుంది. నాణ్యమైన పత్తిని ఉత్పత్తి చేస్తున్నప్పటికీ దిగుబడి మాత్రం ఇతర ప్రాంతాలతో పోల్చితే ఓరుగల్లు రైతులకు తక్కువే వస్తోంది. దీనికి ప్రధాన కారణం తెగుళ్లే. గులాబీ పురుగు దాడికి పత్తి దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతుంది. వేలాది రూపాయల పెట్టుబడి పెట్టి పత్తి సాగు చేసినప్పటికీ ఓరుగల్లు నష్టాలను ఎదుర్కొంటున్నారు.

పరిశోధనలతో రైతులకు ఎంతో మేలు

వీరన్న, కాటన్ ప్రధాన శాస్త్రవేత్త, వరంగల్



వరంగల్‌కు మంజూరైన పత్తి పరిశోధన కేంద్రంతో రైతులకు ఎంతో మేలు. జాతీయ స్థాయిలో పత్తిసాగుపై జరిగే పరిశోధనల ఫలితాలు మనకు కూడా ఉపయోగపడుతాయి. వ్యవసాయరంగంలో ఉన్న టెక్నాలజీని ఉప యోగించుకుని దేశవ్యాప్తగా పత్తి సాగు చేస్తున్న రాష్ట్రాలను సమన్వయం చేసుకుంటూ సమస్యలను ఎదుర్కొనే అవకాశం ఏర్పడుతుంది. స్థానికంగా వచ్చే తెగుళ్లపై ఎప్పటికప్పుడు పరిశోధనలు చేసి, సమస్య పరిష్కారానికి రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు ఈ కేంద్రం ఉపయోగపడుతుంది.

పరారీలో కిలేడీ?

కాల్ డేటాను పరిశీలిస్తున్న పోలీసులు

ఎస్సై బలవన్మరణంపై ఊపందుకున్న దర్యాప్తు

ములుగు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వాజేడు ఎస్సై రుద్రారపు హరీశ్ తన సర్వీసు రివాల్వార్‌తో కాల్చుకొని బలవన్మరణానికి పాల్పడ్డ ఘటనపై పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈనెల 2న జరిగిన ఈ సంఘటన పోలీసు శాఖను తీవ్రంగా కుదిపేసింది. ఎస్సై ఆత్మహత్య చేసుకున్న సమయంలో అతనితోపాటు రిసార్టులో ఉన్న యువతిని అదుపులోకి తీసుకున్న స్థానిక పోలీసులు మరుసటిరోజు ఆమె స్వగ్రామమైన సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం దూద్యాతండాకు తీసుకెళ్లి కుటుంబ సభ్యులకు అప్పగించారు. హరీశ్ తండ్రి ఇచ్చిన ఫిర్యాదులో తన కొడుకు మృతిపట్ల అనుమానాలున్నాయని పేర్కొన్నారు. ఈక్రమంలో పోలీసులు జరుపుతున్న దర్యాప్తులో విస్తుగొలిపే విషయాలు వెలుగుచూస్తున్నాయి. ఎస్సై ఆత్మహత్యకు ప్రధాన కారణం ఆ యువతేనని స్పష్టమవుతోంది. ప్రేమ పేరుతో దగ్గరై ఆతర్వాత వేధింపులకు గురిచేయడంతోనే హరీశ్ తీవ్రమైన ఒత్తిడికి గురై ప్రాణాలు తీసుకున్నట్లు నిర్ధారణకు వచ్చారు. ఎస్సైకు చెందిన మొబైల్ ఫోన్‌లను స్వాధీన పర్చుకొని సాంకేతిక ఆధారాలను సేకరిస్తున్న పోలీసులు కాల్‌డేటాపై కూడా దృష్టిసారించారు. ఈక్రమంలో ఆ కిలేడీ అజ్ఞాతంలోకి వెళ్లినట్లు తెలుస్తోంది. తోటి పోలీసు అధికారిని కోల్పోయిన జిల్లా పోలీసులు ఈకేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని నిజాలను నిగ్గుతేల్చుతున్న తరుణంలో తన పాత్ర ప్రస్ఫుటమవుతుండగా ఎక్కడ జైలుపాలు కావాల్సి వస్తుందోనని ఆమె పరారైనట్లు సమాచారం. సూర్యాపేట జిల్లా చిలుకూరు మండల పోలీసులతో ఎప్పటికప్పుడు టచ్‌లో ఉంటున్న ములుగు జిల్లా పోలీసులు ఆమె ఆచూకీ కోసం ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించిన ఈ సంఘటనపై మీడియాలో రోజుకో రకమైన కథనాలు వస్తుండటంతో వీలైనంత త్వరగా దర్యాప్తును ముగించాలని పోలీసు అధికారులు భావిస్తున్నట్లు సమాచారం.

ప్రజా ప్రభుత్వానికి అండగా ఉండాలి : ఎమ్మెల్యే గండ్ర

చిట్యాల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే అనేక సంక్షేమ పథకాల అమలుతో ముందుకుసాగుతున్న ప్రజా ప్రభుత్వానికి అన్ని వర్గాలు అండగా ఉండాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి అధ్యక్షతన ప్రజాపాలన విజయోత్సవ సభ మండల కేంద్రంలో శనివారం జరిగింది. ఈసందర్భంగా ఎమ్మెల్యే జీఎస్సార్ మాట్లాడుతూ కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా ఆర్థికంగా బలపడేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనేక రంగాల్లో వారికి ప్రాముఖ్యతను ఇస్తున్నారని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం మెజారిటీ స్థానాలను మహిళలకు కేటాయిస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో డీఆర్డీవో నరేష్, ఎంపీడీవో జయశ్రీ, జాతీయ ఓబీసీ చైర్మన్ కత్తి వెంకటస్వామి, టీపీసీసీ అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, ఏఎంసీ చైర్‌పర్సన్ గుమ్మడి శ్రీదేవీ సత్యనారాయణ, రాంనర్సింహరెడ్డి, మధువంశీకృష్ణ, అప్పం కిషన్, పులి తిరుపతిరెడ్డి, దొడ్డి కిష్టయ్య, ఓరం సమ్మయ్య, రత్నాకర్‌రెడ్డి, రాయకొండు, బుర్ర లక్ష్మణ్, శ్రీనివాస్, అల్లకొండ కుమార్ పాల్గొన్నారు.

- టేకుమట్ల (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో జరిగిన ప్రజా పాలన విజయోత్సవాలకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు అయిత ప్రకాశ్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు గాజర్ల అశోక్, మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

- భూపాలపల్లి టౌన్ (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి పట్టణంలోని గుడ్‌మార్నింగ్ పాఠశాల ఆవరణలో ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమాల్లో భాగంగా 7వ రోజు వైజ్ఞానిక ప్రదర్శనను కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు



టేకుమట్లలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు తమ తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ముచేయకుండా చదువుకోవాలని అన్నారు. కష్టంగా కాకుండా ఇష్టంగా చదవాలని సూచించారు. వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికితీస్తుందని అన్నారు. ఈకార్యక్రమంలో ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాశ్‌రెడ్డి, పీడీఈవో రాజేందర్, జిల్లా సైన్స్ అధికారి బర్ల స్వామి, కౌన్సిలర్లు, ప్రైవేటు పాఠశాలల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

- రేగొండ (ఆంధ్రజ్యోతి) : కొత్తపల్లిగోరి మండలంలో ప్రజాపాలన విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యేగా అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాలనని అన్నారు. కొత్తగా ఏర్పడిన కొత్తపల్లిగోరిలో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలకు శంకుస్థాపన చేశానన్నారు. కోటంచ అభివృద్ధికి రూ. 14కోట్లు మంజూరు చేయించానని పేర్కొన్నారు. అధిక వర్షాలతో 124 చెరువులు తెగగా మరమ్మతులు చేయించానన్నారు. గాంధీనగర్ గుట్ట పై విద్యాలయాల నిర్మాణానికి రూ. 146కోట్లు మంజూరు చేయించానని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ ప్రకాశ్‌రెడ్డి, పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కిష్టన్న, పీఏసీఎస్ చైర్మన్ విజ్ఞన్‌రావు, నాయకులు ఎన్.సంపత్‌రావు, నర్సన్న, ఓంప్రకాశ్, వీర బ్రహ్మం, మటిక సంతోష్, పత్తి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సై హరీశ్ సంతాప సభ

వాజేడు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రివ్వార్‌తో కాల్చుకొని ఆత్మహత్య చేసుకున్న వాజేడు ఎస్సై హరీశ్ సంతాప సభ మండల కేంద్రంలో శనివారం జరిగింది. వివిధ పార్టీల నాయకులతోపాటు వెంకటాపురం సీఐ కుమార్, పేరూరు ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్, వెంకటాపురం ఎస్సై కొప్పుల తిరుపతిరావు హాజరయ్యారు. హనుమాన్ సెంటర్‌లో ఎస్సై మృతికి సంతాపంగా మానవహారం చేపట్టి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం జరిగిన సంతాప సభలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. విధి నిర్వహణలో హరీశ్ సేవలను స్మరించుకున్నారు. ఈ



మాట్లాడుతున్న సీఐ

కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ వర్మ, వివిధ పార్టీల నాయకులు ఆచంటి ప్రసాద్, సోమిడి నరసింహరావు, తల్లడి ఆదినారాయణ, దత్తుడు బాబు, డీటీ రాహుల్, ఎంసీహెచ్ వైద్యాధికారి యోషిత, ఎంఈవో వెంకటేశ్వర్లు, కేజీబీవీ ఎస్‌వో సుజాత, వాజేడు మీడియా అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ దావూద్, ఆటోయూనియన్ అధ్యక్షుడు చిరంజీవి, ఆర్ఎంపీల సంఘం అధ్యక్షుడు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ రీల్

14న జాతీయ లోక్ అదాలత్

భూపాలపల్లి కృష్ణకాలనీ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్‌ను ఈ నెల 14న జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు భూపాలపల్లి జిల్లా జడ్జి పి.నారాయణబాబు తెలిపారు. జిల్లా పరిధి లోని పోలీస్ అధికారులతో సమన్వయ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. జాతీయ లోక్ అదాలత్‌లో పెద్ద ఎత్తున కేసులు పరిష్కరించుకునేలా కృషి చేయాలన్నారు. రాజీ మార్గం ఉన్న ప్రయోజనాలేమిటో కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జయ రాంరెడ్డి, జూనియర్ సివిల్ జడ్జి రామచంద్రారావు, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి అఖిల, ఎక్సైజ్ సూపరింటెండెంట్ వేముల శ్రీనివాస్, అడిషనల్ ఎస్పీ బోనాల కిషన్, డీఎస్పీ సంపత్‌రావు జిల్లా పరిధిలోని సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా జడ్జి నారాయణబాబు

సమగ్రశిక్ష ఉద్యోగుల సమ్మె ప్రారంభం

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తమ సర్వీసులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష ఉద్యోగులు శనివారం జిల్లాకేంద్రంలోని పోస్టాఫీస్ సమీపంలో సమ్మెను ప్రారంభిం చారు. ఈసందర్భంగా సమగ్రశిక్ష ఉద్యోగుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు చల్లా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ గత సంవత్సరం కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఈనెల 9లోగా తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనట్లయితే నిరవధిక సమ్మె చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈసమ్మెలో జేఏసీ ప్రధాన కార్యదర్శి సోమిడి కరుణాకర్, కోశాధికారి పాడ్య కుమార్, జిల్లా అసోసియేట్ సభ్యులు ఫిరోజ్, నాంపల్లి చిరంజీవి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం

వెంకటాపురం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఉమారామ లింగేశ్వరస్వామి ఆలయంలో వేంచేసి ఉన్న శ్రీవల్లిదేవ సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం శనివారం ఘనంగా జరిగింది. సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా ఆలయం ప్రాంగణంలోని కల్యాణ మండపంలో పురోహితులు రామశర్మ సుబ్రహ్మణ్యస్వామి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో కళకళలాడింది. కల్యాణ మహోత్సవం అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. భక్తులకు ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు చర్యలు చేపట్టారు.



కల్యాణోత్సవంలో భక్తులు

బోర్లగూడెం ప్రాథమికోన్నత పాఠశాల అప్‌గ్రేడ్

మహాముత్తారం, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోర్లగూడెం ప్రాథమికోన్నత పాఠశాలను హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ అయ్యింది. ఈమేరకు విద్యాశాఖ డైరెక్టర్ నర్సింహరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పాఠశాలలో పదో తరగతి తరగతులు నిర్వహించడానికి అనుమతి ఇచ్చారు.

పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ వంచన : కాంగ్రెస్

కాటారం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): తన పదేళ్లపాలనలో సంక్షేమాన్ని విస్మరించిన బీఆర్ఎస్ ప్రజలను వంచించిందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చీమల సందీప్, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, పార్టీ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు జాడి మహేశ్వరి విమర్శించారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో వారు శనివారం విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉండటాన్ని జీర్ణించుకోలేక మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు వంచన దినం పేరిట రాజకీయ పబ్బం గడుపుతున్నారని ఆరోపించారు. ప్రజా పాలన గురించి మాట్లాడే అర్హత అక్రమాస్తులు కూడగట్టుకున్న బీఆర్ఎస్ నాయకులకు లేదని దుయ్యబట్టారు. విలేకరుల సమావేశంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చీటూరి మహేష్, కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ నాయకులు నవీన్‌రావు, నాయిని శ్రీనివాస్, కొట్టె ప్రభాకర్, కడారి విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

గోవిందరావుపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాంధీనగర్ గ్రామానికి చెందిన కురిమిల్ల మల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబసభ్యులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ శనివారం పరామర్శించారు. ఈసందర్భంగా రూ.4వేల నగదు అందజేసి ఎల్లవేళలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రసూత్ సీతారాంనాయక్, నాయకులు జెట్టి సోమయ్య, కణతల నాగేందర్‌రావు, మద్దాలి నాగమణి, కొంపెల్లి శ్రీను, భూక్య సుక్యా బాలు, తుమ్మల శివ, తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరంలో భారీ వర్షం

మహదేవపూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాళేశ్వరంలో శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది ఈదురు గాలులు ఉరుముల మెరుపులతో వాన పడింది. దీంతో కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. దీంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉత్సాహంగా సీఎం కప్ క్రీడా పోటీలు

వాజేడు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీహైస్కూల్ క్రీడా మైదానంలో శనివారం సీఎం కప్ క్రీడా పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మండలంలోని వివిధ పాఠశాలల నుంచి వచ్చిన క్రీడాకారులను ఎంఈవో వెంకటేశ్వర్లు క్రీడలను ప్రారంభించారు. ఉపాధ్యాయులు స్వరూప్ సింగ్, పీఈటీలు రాజ్యలక్ష్మి, అరుణ, పద్మ, దేవేంద్ర, మల్లయ్య, కుమార్‌బాబు, ప్రభాకర్, ఆనంద్, రాజేష్, శ్రీరంగం, తదితరులు పాల్గొన్నారు.

సూపర్ మార్కెట్‌లో మోసం!

కాకతీయఖని, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి పట్టణంలోని సూపర్ మార్కెట్ల యజమానులు ఘరానా మోసాలకు పాల్పడుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. వస్తువుపై ఉన్న ఎమ్మార్పీ ధర కంటె అధిక ధర వసూలు చేస్తున్నట్లు వినియోగ దారులు ఆరోపిస్తున్నారు. ఈనెల 6న ఓ వినియోగ దారుడు పట్టణంలోని ఉడిపి హోటల్ సమీపంలోని ఓ సూపర్ మార్కెట్‌కు వెళ్లి తనకు కావాల్సిన సరుకులను కొనుగోలు చేశాడు. బిల్లు మొత్తం రూ.397 అయిందని షాపు నిర్వాహకుడు రశీదు ఇచ్చాడు. దానిని పరిశీలించిన వినియోగదారుడు ఇందులో రూ.105 ఉన్న ప్యాకెట్‌కు రూ.110 ఎందుకు వేశారని ప్రశ్నించాడు. దీంతో కంగుతిన్న షాపు నిర్వాహకుడు కంప్యూటర్ తప్పిదమని తప్పించుకునే ప్రయత్నం చేశాడు. అలాగే మరో వ్యక్తి వేరే సూపర్ మార్కెట్‌లో షుగర్, కందిపప్పు, పెసర పప్పు తదితర సామాన్లను కొనుగోలు చేశాడు. ఆ ప్యాకిట్లపై మ్యాన్‌ఫ్యాక్చరింగ్ కంపెనీ పేరుగానీ, తయారి తేదీ, ఎక్స్‌పైరీ తేదీలు లేవని ఆ వినియోగదారుడు తెలిపాడు.

యువజన కాంగ్రెస్ నాయకులకు సన్మానం

మంగపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన ఎం.డి.ఇస్సార్‌ఖాన్, నియోజకవర్గ అధ్యక్షుడిగా ఎన్నికైన మారం సునీల్‌రెడ్డిని మంత్రి సీతక్క సన్మానించారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఈ కార్యక్రమం శనివారం జరిగింది.



సన్మానిస్తున్న మంత్రి సీతక్క

- కాటారం (ఆంధ్రజ్యోతి): యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో మంథని నియోజకవర్గ అధ్యక్షుడిగా ఎన్నికైన చీమల సందీప్, మండల అధ్యక్షుడిగా ఎన్నికైన చీటూరి మహేష్‌ను ధన్వాడ, చిదినేపల్లి యూత్‌కాంగ్రెస్ నాయకులు శనివారం సన్మానించారు. శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందించి ప్రజాసేవలో ఉన్నతమైన పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు టీకాలు వేయాలి : డీఎంహెచ్‌వో

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వైద్యులు, సిబ్బంది సకాలంలో చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేయాలని డీఎంహెచ్‌వో గోపాల్‌రావు అన్నారు. శనివారం ములుగులోని మెడికల్ కళాశాల సమావేశహాల్‌లో వ్యాధి నిరోధక టీకాల నిర్వహణపై జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లోని పిల్లలకు టీకాలు వేయించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. క్షయ, కాలేయ, పోలియో, డిఫ్తీరియా, కోరింత దగ్గు, ధనుర్వాతం, మీజిల్స్‌రూబిల్ల, వాంతులు, విరోచనలు, నిమోనియా, శ్వాసకోశ సంబంధమైన వ్యాధులకు ఇచ్చే టీకాల నిల్వలు, నిర్వహణ, రిపోర్టుల తయారీపై అవగాహన కల్పించారు. హైరిస్క్ ప్రాంతాలలో 0-5ఏళ్లలోపు పిల్లలను గుర్తించి వారందరికీ టీకాలు వేయాలన్నారు. శిక్షణ కార్యక్రమంలో వైద్యులు మురారి రాజేంద్రప్రసాద్, జ్యోత్స్న, డేవిడ్, అతుల్, జిల్లా శిశు ఆరోగ్యం, వ్యాధినిరోధక టీకాల ప్రోగ్రాం అధికారి రణధీర్, జిల్లా తల్లి ఆరోగ్యం, పోషకాహార ప్రోగ్రాం అధికారి శ్రీకాంత్, జిల్లా అసంక్రమిక వ్యాధుల నియంత్రణ ప్రోగ్రాం అధికారి పవన్‌కుమార్, ఇన్‌చార్జి డెమో సంపత్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌లు పూర్ణ, సంపత్‌రావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కన్నాయిగూడెం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఏటూరునాగారం నుంచి కన్నాయిగూడెం వరకు ఉన్న 33 కేవీ లైన్‌లో ఇన్సులేటర్లు మార్చుతున్న నేపథ్యంలో మండలంలో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

అడవుల్లో అగ్నిప్రమాదాలపై అవగాహన

వాజేడు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): అడవుల్లో జరిగే అగ్ని ప్రమాదాలపై ఫారెస్టు అధికారులు మండల కేంద్రంలో అవగాహన కల్పించారు. ఎఫ్ఎస్‌వో నాగమణి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో శనివారం ఈ కార్యక్రమం జరిగింది. అడవులకు నిప్పుపెట్టడం వల్ల పర్యావరణ సమస్యలు ఉత్పన్నం అవుతాయన్నారు. మంటలు అంటుకొని విలువైన మొక్కలు, జంతువులు చనిపోయే ఆస్కారం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌బీవో సరోజ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్ల డ్రాఫ్ట్ పబ్లికేషన్

కాటారం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని 24 గ్రామపంచాయతీల పరిధిలో పంచాయతీల పాలకవర్గాల ఎన్నికల కోసం ఏర్పాటు చేయబోయే పోలింగ్‌స్టేషన్ల డ్రాఫ్ట్ పబ్లికేషన్ శనివారం చేపట్టారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంతోపాటు ఆయా జీపీ కార్యాలయాల్లో పోలింగ్ స్టేషన్ల సంఖ్య, ప్రదేశాలతో కూడిన డ్రాఫ్ట్ పబ్లికేషన్ చేశారు. 24 జీపీల పరిధిలో 210పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసినట్లు జాబితాలో రూపొందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బాబు, ఎంపీవో వీరస్వామి, మండల పరిషత్ సిబ్బంది, కార్యదర్శులు తదిరులు ఉన్నారు.

కాళేశ్వరంలో కాలసర్ప దోష నివారణ పూజలు

మహదేవపూర్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) : కాళేశ్వర ముక్తీశ్వరస్వామి పుణ్యక్షేత్రంలో శనివారం భక్తులు కాలసర్ప దోష నివారణ పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో వేద పండితులు, అర్చక స్వాములు శ్రీ సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా సుబ్రహ్మణ్యస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహణాధికారి ఎ.మారుతి, సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

దళితుల సంక్షేమానికి కృషి చేయాలి

కాటారం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): దళితుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని దళితబంధు సాధనసమితి భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు నముండ్ల సంపత్, మంథని నియోజకవర్గ అధ్యక్షుడు ఊట్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ప్రతి దళిత కుటుంబానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళితబంధు లేదా కాంగ్రెస్ మెనిఫెస్టోలో పెట్టిన అంబేద్కర్ అభయహస్తం పథకాన్నయినా మంజూరు చేయాలని అన్నారు. మండల కేంద్రంలోని అయ్యప్ప కల్యాణ మండపంలో దళితబంధు ధర్మయుద్ధం మహాసభ శనివారం జరిగింది. అంబేద్కర్ కూడలి నుంచి వందలాది మంది దళితులు, ప్రతిపక్ష పార్టీల నాయకులు సభాస్థలి వద్దకు ర్యాలీగా వెళ్లారు. ధర్మయుద్ధం మహా సభకు బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్ట మధు, బీజేపీ రాష్ట్ర నాయకుడు చల్ల నారాయణరెడ్డి, డీఎస్పీ నేత శ్రీనివాస్, బీఎస్పీ నేత రాజబాబు సంఘీభావం తెలిపారు. ప్రభుత్వం దళితులకిచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సంపత్, శ్రీనివాస్, జక్కయ్య మాటాడారు. ఈ సభలో బహుజన సేవా రాష్ట్ర ఉపాధ్యక్షుడు శంకర్‌లాల్, డీఎస్పీ నేత చిట్యాల శ్రీనివాస్, బీఎస్పీ నేత బొడ్డు రాజబాబు, పలు ప్రజా, దళిత సంఘాల నాయకులు జక్కు రాకేష్, పంతకాని సడువలి, కొండగొర్ల వెంకటస్వామి, బొడ్డు రాజబాపు, లక్ష్మణ్, కిరణ్, చంద్రమౌళి, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

డబ్బు, బంగారం కోసమే హత్య

బ్యాంక్ రిటైర్డ్ మేనేజర్ మర్డర్ కేసును ఛేదించిన పోలీసులు

మట్టెవాడ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు రిటైర్డ్ మేనేజర్ ఎలిగేటి రాజమోహన్ హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఐదు రోజులపాటు పలు కోణాల్లో విచారణ జరిపి నిందితుడిని పట్టుకున్నారు. డబ్బులు, బంగారం కోసమే ఈ హత్య చేసినట్లు నిర్ధారించారు. కేసు వివరాలను శనివారం సాయంత్రం మట్టెవాడ పోలీసుస్టేషన్‌లో వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్ వెల్లడించారు.

ములుగు జిల్లా మంగపేట మండలం కోమటిపల్లి గ్రామానికి చెందిన నిందితుడు జక్కుల శ్రీనివాసరావు కొంత కాలంగా హనుమకొండ ప్రగతినగర్ రెవెన్యూ కాలనీలో నివాసం ఉంటున్నాడు. అదే గ్రామానికి చెందిన మణెమ్మ అనే మహిళతో సహజీవనం చేస్తున్నాడు. ప్రధానమంత్రి యోజన స్కీమ్‌లో కో ఆర్డినేటర్‌గా పని చేస్తూనే దాంతో పాటు పెళ్లి సంబంధాలు చూస్తానంటూ డబ్బున్నవారికి అందమైన అమ్మాయిల ఫొటోలు చూపిస్తూ మభ్యపెట్టి ఏదో ఒకరకంగా వారిని ఇరికించి తద్వారా డబ్బు వసూలు చేయడం అలవాటు చేసుకున్నాడు. ఈ క్రమంలో రెండు నెలల కిందట అతడికి ఒక ఫోన్ దొరికింది. దాన్ని తిరిగి ఇచ్చే క్రమంలో రాజమోహన్‌తో పరిచయం ఏర్పడింది. తర్వాత వీరిద్దరు కలిసి తిరగడం, బార్లలో కూర్చొని మద్యం సేవించడం మామూలైపోయింది. ఈ క్రమంలో 'తనకు ఇద్దరు ఆడ పిల్లలని, ఒకరు యూఎస్ఏలో, మరొకరు హైదరాబాద్‌లో ఉంటున్నారని, తన భార్య చనిపోయిందని, ప్రస్తుతం ఒంటరిగా ఉంటున్నానని, ఎవరైనా వితంతు ఉంటే పెళ్లి చేసుకుంటానని రాజమోహన్ చెప్పుకున్నాడు. దీన్ని ఆసరాగా తీసుకున్న శ్రీనివాసరావు తనకు రూ.5లక్షలు అవసరం ఉందని అడిగాడు. ప్రస్తుతం తన దగ్గర లేవని రాజమోహన్ చెప్పడంతో ఎలాగైనా అతడి ఒంటిమీద ఉన్న బంగారం అయినా తీసుకోవాలని భావించాడు. పథకం ప్రకారం ఈ నెల 2న రాత్రి రిటైర్డు మేనేజర్‌ని నమ్మించి ప్రగతినగర్‌లోని తన ఇంటికి తీసుకొచ్చి మద్యం తాగించాడు. తర్వాత రోకలిబండతో కొట్టి చంపేశాడు. అతడి ఒంటిపై ఉన్న బంగారు బ్రాస్‌లెట్, గొలుసు, మూడు ఉంగరాలు తీసుకున్నాడు. తర్వాత మృతదేహాన్ని కారు వెనుకసీటులో పెట్టుకొని నగరంలోని పలుప్రాంతాల్లో తిరిగాడు. ఎక్కడా పడేయడానికి వీలు కాకపోవడంతో చివరికి వరంగల్ రంగంపేట ఏరియాకి వచ్చి అక్కడ ఎలాంటి జనసంచారం లేకపోవడంతో రోడ్డుపక్కన కారు వదిలిపెట్టి అక్కడి నుంచి ఆటోలో వెళ్లిపోయాడు.

ఆటో ఆధారంగా నిందితుడి ఆచూకీ

శ్రీనివాసరావు ప్రయాణించిన ఆటోను సీసీ పుటేజీ ద్వారా పరిశీలించిన పోలీసులు ఆటోడ్రైవర్‌తో మాట్లాడి అతడి ఆచూకీ తెలుసుకున్నారు. శనివారం అరెస్టు చేసి అతడి వద్ద సెల్‌ఫోన్, నాలుగున్నర తులాల బంగారు ఆభరణాలతో పాటు అతడు ఉప యోగించిన రోకలిబండను సైతం స్వాధీనపర్చుకున్నారు. హత్య కేసును ఛేదించడంలో ప్రతిభ కనబర్చిన మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి, సబ్ ఇన్‌స్పెక్టర్లు నవీన్, సాంబయ్య, విఠల్, లచ్చయ్య, క్రైం పార్టీ పోలీసులను ఏసీపీ నందిరాం నాయక్ అభినందించారు. కాగా, నిందితుడు గతంలో యూట్యూబర్‌గా పనిచేస్తూ జర్నలిస్టు అంటూ బెదిరింపులకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో తేలింది.

కోమటిపల్లిలో కేసులు

మంగపేట (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో ఇటీవల జరిగిన రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి రాజమోహన్ హత్య కేసులో నిందితుడైన జక్కుల శ్రీనివాస్ మంగపేట మండలం కోమటిపల్లి గ్రామ వాసి. ఏ పనిచేయకుండా జులాయిగా తిరిగే అతడు గతంలోనూ అనేక నేరా లకు పాల్పడినట్టు తెలుస్తోంది. స్వగ్రామంలో ఘర్షణలు, దాడులకు పాల్పడిన కేసులు అతడిపై ఉన్నట్టు సమాచారం. ఈ క్రమంలోనే అదే గ్రామానికి చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్న శ్రీనివాస్ కొన్నేళ్ల క్రితం ఆమెతో ఉడాయించి వరంగల్‌లో సహజీవనం చేస్తున్నట్టు తెలిసింది. దీంతో స్వగ్రామంతో అతడి సంబంధాలు పూర్తిగా తెగిపోయాయని స్థానికులు అంటున్నారు. తల్లిదండ్రులు మాత్రం కొమటిపల్లిలోనే నివసిస్తున్నారు.

పారదర్శకంగా 'ఇందిరమ్మ' సర్వే చేపట్టాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పారదర్శకంగా చేపట్టాలని అధికారులను కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆయన శనివారం సమావేశమయ్యారు. ఇందిరమ్మ మొబైల్ యాప్ వినియోగం, సర్వే విధానంపై సమీక్షించారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా లబ్ధిదారుల వివరాలను నిష్పక్షపాతంగా నమోదు చేయాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలను అనుగుణంగా సర్వే నిర్వహించాలన్నారు. ఇందిరమ్మ మొబైల్ యాప్‌పై ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు సమగ్ర అవగాహన కలిగి ఉండాలన్నారు. సర్వేలో దరఖాస్తుదారుల వివరాలను పక్కాగా సేకరిస్తూ, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా యాప్‌లో అప్లోడ్ చేయాలన్నారు. ఈనెల 20లోగా సర్వేను పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, డీపీవో నారాయణరావు, ఆర్డీవో మంగిలాల్ తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీ పుష్కరాల నిర్వహణకు నివేదికలు అందించాలి

మే నెలలో నిర్వహించే సరస్వతీ పుష్కరాల నిర్వహణకు అధికారులు నివేదికలను అందజేయాలని అధికారులను కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించిన ఆయన సరస్వతీ పుష్కరాల నిర్వహణపై సమీక్షించారు. 2025 మే 15 నుంచి 26 వరకు 12 రోజుల పాటు పుష్కరాలను కాళేశ్వరం పుణ్యక్షేత్రంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లకు సంబంధిత అధికారులు నివేదికలు అందజేయాలన్నారు.

ఎలాంటి పొరపాట్లకు తావివ్వొద్దు

ములుగు కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో అర్హులను గుర్తించడానికి ఇళ్ల స్థలాల వివరాల నమోదు కీలకమని, నమోదు సందర్భంగా ఎలాంటి పొరపాట్లకు అవకాశం ఇవ్వొద్దని కలెక్టర్ టీఎస్.దివాకర అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, గ్రామ కార్యదర్శులతో శనివారం జరిగిన సమావేశంలో అదనపు కలెక్టర్ సంపత్‌రావుతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. గతంలో ఇళ్ల నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్ల వద్దకు వెళ్లి ఇంటి స్థలాన్ని పరిశీలించి ధ్రువీకరణ పత్రాలు, లబ్ధిదారుల ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు వివరాలను సేకరించాలన్నారు. లబ్ధిదారులు ఇళ్ల వద్దలేని పక్షంలో వలస వెళ్లినవారికి సెల్‌ఫోన్ ద్వారా వివరాలను సేకరించాలని, వివరాల సేకరణను ప్రతి ఒక్కరూ ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలన్నారు. నిర్దేశించిన గడువులోపు వివరాలను సేకరించాలని, ఎలాంటి తప్పులు లేకుండా పూర్తి చేయాలని సూచించారు. సేకరించిన వివరాలను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఈసమావేశంలో జిల్లాలోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, గ్రామ కార్యదర్శులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమంలో రేవంత్ సర్కారు విఫలం

మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు

మల్హర్, డిసెంబర్ 7(ఆంధ్రజ్యోతి) : సంక్షేమంలో రేవంత్ సర్కారు విఫలమైందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజావంచిత దినం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రమైన తాడిచర్లలో శనివారం నిరసన చేపట్టారు. మంథని ఎమ్మెల్యే ఐదుసార్లు ఎన్నికైన నాయకుడు నియోజకర్గ ప్రజలను మోసం చేస్తూ వచ్చాడని, మొన్నటి ఎన్నికల్లో మాత్రం మేనిఫెస్టో పేరుతో ఏకంగా రాష్ట్ర ప్రజలనే మోసం చేశాడని దుయ్యబట్టారు. రైతులకు రుణమాఫీ, రైతు భరోసా పేరుతో రేవంత్ సర్కారు దగా చేసిందని ఆరోపించారు. రైతు భరోసా ఎగ్గొటిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దుక్కుతుందన్నారు. పథకాలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేసినందుకేనా విజయోత్సవాలు నిర్వహించుకుంటున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాఘవరెడ్డి, గోనె శ్రీనివాస్ రావు, కోట రవి, తాజుద్దీన్, యాదగిరిరావు, బాలాజీ నాయక్, హరీశ్, సమ్మయ్య, సత్యనారాయణ, మధుసూధన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

కాటారం (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు శనివారం పర్యటించారు. పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. దుబ్బపల్లి గ్రామంలో మట్కారి శివదర్శన్ మృతదేహానికి నివాళులర్పించారు. ధర్మసాగర్, ఒడిపిలవంచ గ్రామాల్లో వివిధ కారణాలతో ఇటీవల మృతి చెందిన వెంకటమ్మ, చిలుకమ్మ, రుక్కమ్మ కుటుంబసభ్యులను మధు పరామర్శించారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి జోడు శ్రీనివాస్, యూత్ మండల అధ్యక్షుడు రామిళ్ల కిరణ్, మాజీ ఎంపీటీసీ బాసాని రవి తదితరులు పాల్గొన్నారు.

ఆటోల బంద్ విజయవంతం

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర యూనియన్ జేఏసీ సంఘాల అధ్యక్షుడు మంద రవికుమార్ ఇచ్చిన పిలుపుమేరకు ములుగులో శనివారం ఆటో డ్రైవర్లు, ఓనర్లు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. ఈసందర్భంగా డ్రైవర్లు, ఓనర్లు పట్టణంలోని డీఎల్ఆర్ గార్డెన్ నుంచి ఏరియా వైద్యశాల వరకు 163వ జాతీయ రహదారిపై రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం యూనియన్ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించిందని విమర్శించారు. ఆటో కార్మికులకు ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలని, చనిపోయిన కార్మికుల కుటుంబాలకు రూ.20లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని, ప్రత్యేక ప్యాకేజీతో హెల్త్‌కార్డులు జారీచేసి కార్పొరేట్ ఆస్పత్రులు చికిత్స అందించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో జేఏసీ కార్యదర్శి, ములుగు జిల్లా ఇన్‌చార్జి వేల్పుల నరేష్, కన్వీనర్ ఎమ్డీ.జహీర్, టీఏడీయూ యూనియన్ జిల్లా అధ్యక్షుడు గట్ల వీరస్వామి, ఉపాధ్యక్షుడు భద్రయ్య, కోకన్వీనర్ హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

- కాటారం (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆటో డ్రైవర్స్, ఓనర్స్ యూనియన్ల జాయింట్ యాక్షన్ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు శనివారం ఆటోల బంద్ విజయవంతంగా జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం అమలు చేసి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పెట్టడంతో ఆటోల నిర్వహణ దయనీయంగా మారిందని, కాంగ్రెస్ మేనిఫెస్టోలో జీవనోపాధి కోసం ఏడాదికి రూ.12వేలు సాయంగా అందిస్తామన్న హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బంద్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ మండల అధ్యక్షుడు పేట బక్క య్య, ఉపాధ్యక్షుడు మారపాక వెంకటస్వామి, ప్రధానకార్యదర్శి జిల్లెల్ల శంకర్ , కోశాధికారి అంగడి వెంకటేశ్, అధికార ప్రతినిధి మంథెన మహేష్, కార్యదర్శులు గద్దల తిరుపతి, సంగెం మల్లయ్య, సహాయ కార్యదర్శి చీర్ల శ్రీనివాస్ తదితర నాయకులు పాల్గొన్నారు.

జిట్రేగి కలప స్వాధీనం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మహాముత్తారం, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): మహాముత్తారం, పలిమెల అడువుల్లో కొనసాగుతున్న జిట్రేగి కలప అక్రమ రవాణాపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై ఫారెస్టు అధికారులు స్పందించారు. జీలపల్లి, నిమ్మగూడెం, య త్నారం అడువుల్లో గాలింపు చర్యలు చేప ట్టారు. దట్టమైన అడువుల్లో స్మగ్లర్లు నరికిన జిట్రేగి, మద్ది కలపను గుర్తించి స్వాధీనం చేసుకున్న అధికారులు రెండు ఎడ్ల బండ్ల ద్వారా శనివారం యత్నారం గ్రామానికి కలపను తీసుకొచ్చారు. అక్కడ నుంచి కలపను స్థానిక ఎఫ్‌బీవో మానస మహదేవపూర్ డిపోకు తరలించారు. నాణ్య మైన జిట్రేగి కలప ఈ ప్రాంత అడువులలో దొరుకుతుండటంతో స్మగ్లర్లు స్థానిక గ్రామాలకు చెందిన కొంత మంది వ్యక్తులను మచ్చిక చేసుకొని అడువుల్లోనే కలపను చదును చేసుకొని రాత్రి పూట వాహనాల్లో ఆంధ్రకు తరలిస్తున్నారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించగా అధికారులు స్పందిం చారు.